TGTEL/25/A3750

... నిజమే ...

# నిజాయితీ

https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

"నిజాయితీ" ఒక ముఖ్యమైన నైతిక లక్షణం ఇది విశ్వసనీయత, విధేయత మరియు సమగ్రతను పెంచుతుంది.



ఎడిటర్ : బొడ్డుపల్లి మల్లయ్య సంపుటి 1 సంచిక 56 నెట్‌వర్క్ ఇంచార్జ్ & మెయింటెనెన్స్ : గుండూర్ శ్యామ్ . మంగళవారం 13 జనవరి 2026 వెల 4:00

# జిల్లాల పునర్విభజన పై

## రేవంత్ కీలక ప్రకటన

**హైదరాబాద్, జనవరి 12 (నిజాయితీ) :** కొద్ది రోజులుగా రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన పైన చర్చ జరుగుతోంది. ఏ జిల్లా సరిహద్దులు మారుతాయి.. కొత్తగా ఎక్కడ జిల్లా ఏర్పాటవుతుందనే అంచనాలు మొదలయ్యాయి. జిల్లాల పునర్విభజన ఉంటుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. కాగా, ఇప్పుడు సీఎం రేవంత్ ఇదే విషయం పైన స్పష్టత ఇచ్చారు. తమ కార్యాచరణ పైన క్లారిటీ ఇవ్వటంతో పాటుగా... ఏ విధంగా ముందకు వెళ్లేదీ తేల్చి చెప్పారు. దీంతో.. జిల్లాల పునర్విభజన పైన ఇప్పుడు ఆసక్తి పెరుగుతోంది. ముఖ్యమంత్రి రేవంత్ జిల్లాల పునర్విభజన పైన స్పష్టత ఇచ్చారు. గతంలో పద్దతి లేకుండా జిల్లాలను పునర్విభజన చేసారని చెప్పుకొచ్చారు. జిల్లాలు, మండలాల రేషనలైజేషన్ విషయంలో పలు విజ్ఞప్తులు, డిమాండ్స్ వచ్చాయని వివరించారు. గతంలో జిల్లాలు, మండలాలను ఇష్టం వచ్చినట్లుగా విభజించారని విమర్శించారు. జిల్లాలు, మండలాల పునర్ వ్యవస్థీకరణకు త్వరలోనే రిటైర్డ్ హైకోర్టు లేదా సుప్రీం కోర్టు జడ్జితో ఒక కమిషన్ ను నియమిస్తామని రేవంత్ ప్రకటించారు. ఈ కమిషన్ రాష్ట్రమంతా పర్యటించి జిల్లాలు, మండలాల రేషనలైజేషన్ విషయంలో ప్రజల సూచన లు, సలహాలు తీసుకుంటుందని చెప్పారు. బడ్జెట్ సమావేశంలో అన్ని రాజకీయ పార్టీలతో కూలంకషంగా చర్చించి విధి విధానాలు ఖరారు చేస్తామని వెల్లడించారు. గత ప్రభుత్వం జిల్లాల పునర్విభజన సమయంలో చేసిన తప్పుల కారణంగా ఇప్పుడు డిమాండ్లు పెరిగాయని రేవంత్ చెప్పుకొచ్చారు. దీంతో, ప్రస్తుతం ఉన్న జిల్లాల సంఖ్య ఒకటి నుంచి రెండు వరకు పెరిగే అవకాశం ఉందనే అంచనాలు వ్యక్తం అవుతున్నాయి. అదే సమయంలో రెవిన్యూ డివిజన్లు.. మండలాల్లోనూ మార్పు లు ఖాయమని తెలుస్తోంది. ఈ నెల



18న జరిగే మంత్రివర్గ భేటీలో ఈ అంశం పైన చర్చించి అసెంబ్లీ వేదికగా అన్ని పార్టీల అభిప్రాయాలను తీసుకోనున్నారు. అదే సమయంలో కమిటీ ఏర్పాటు పైనా రేవంత్ ప్రకటించే అవకాశం ఉంది. ఇక.. సికింద్రాబాద్ విషయంలో తన హయాం లో ఎలాంటి మార్పులు చేయలేదని స్పష్టం చేసారు. జిల్లాల సరిహద్దులు మార్చాలని విజ్ఞప్తులు వస్తున్నాయని, అందుకు అనుగుణంగా జిల్లాల పునర్విభజన చేయనున్నట్లు వివరించారు. ఈ క్రమంలోనే కొత్త జిల్లా కేంద్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు రాచకొండ కమిషనరేట్ పేరు సహేతుకంగా లేదని, అందుకే మార్చినట్లు సీఎం పేర్కొన్నారు. రాచకొండ పేరు రాచరిక పాలనకు గుర్తుగా ఉందని మార్చామని చెప్పారు.

# ఎపి ఉల్లంఘనలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చాం : ఉత్తమ్




**హైదరాబాద్, జనవరి 12 (నిజాయితీ) :** పోలవరం- నల్లమలసాగర్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో విచారణ జరిపింది. పిటిషన్ డిస్పోజ్ ఆఫ్ చేసినట్లుగా సిజెఐ ప్రకటించింది. సిజెఐ రిట్ పిటిషన్ వల్ల పిటిషన్ కు ఎలాంటి ఉపయోగం ఉండదని తెలిపింది. సూట్ దాఖలు చేస్తే అన్ని పరీవాహక అభిప్రాయాలు పరిగణనలోకి వస్తాయని సిజెఐ వివరించింది. సుప్రీంకోర్టులో పిటిషన్ ను రాష్ట్ర ప్రభుత్వం వెనక్కితీసుకుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. సిజెఐ సూచన మేరకు పిటిషన్ ఉపసంహరించుకున్నామని తెలియజేశారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. సివిల్ సూట్ రూపంలో మళ్లీ రావాలని సిజెఐ సూచించారని పేర్కొన్నారు. ఆర్టికల్ 131 రూపంలో రావాలని సిజెఐ సూచించారని, రాష్ట్ర ప్రభుత్వం తరపున తమ వాదనలు వినిపించామని తెలియజేశారు. కేటాయింపు కంటే నీళ్లు వాడొద్దనేది ముఖ్యమైన అంశం అని.. ఎపి ప్రభుత్వ ఉల్లంఘనలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకొచ్చామన్నారు. స్టాప్ వర్క్ ఆర్డర్ ను అమలు చేయట్లేదని కూడా కోర్టుకు చెప్పామని, గత డిజైన్ కు అదనంగా ఏమీ చేయడానికి వీల్లేదని వాదించామని ఉత్తమ్ కుమారు స్పష్టం చేశారు.

## హైదరాబాద్‌లో

# యువతి దారుణ హత్య!

- సరిగ్గా మాట్లాడుత లేదనే అనుమానంతో
- పదునైన ఆయుధంతో దాడి చేసిన యువకుడు
- స్పాట్‌లోనే ప్రాణాలు పోయినట్లు తెలిపిన పోలీసులు

**హైదరాబాద్, జనవరి 12 (నిజాయితీ) :** హైదరాబాద్ నగరంలో మరో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. బోరబండ ప్రాంతంలో ఓ యువకుడు తనతో సరిగ్గా మాట్లాడటం లేదనే కారణంతో ఓ యువతిని దారుణంగా హత్య చేశాడు. ఈ దారుణ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. దీంతో నగరంలో మహిళల భద్రతపై మరోసారి తీవ్ర చర్చకు దారితీసింది. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

**పబ్‌లో పరిచయం.. మొదలైన స్నేహం..**

పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నిందితుడైన యువకుడికి, యువతితో బంజారాహిల్స్‌లోని ఓ పబ్‌లో గతంలో పరిచయం ఏర్పడింది. ఆ పబ్‌లో యువతి ఉద్యోగం చేస్తుండగా, తరచూ అక్కడికి వచ్చే యువకుడితో పరిచయం ఏర్పడి క్రమంగా స్నేహంగా మారింది. మొదట సాధారణంగా మాట్లాడుకున్నా.. కాలక్రమేణా ఇద్దరి మధ్య సన్నిహిత సంబంధం ఏర్పడినట్లు తెలుస్తోంది.

**ఊర్వశీ బార్‌కు షిఫ్ట్ అయిన యువతి..**

అయితే.. కొద్ది రోజుల క్రితం ఆ యువతి బంజారాహిల్స్‌లోని పబ్‌ను విడిచి, బోరబండ పరిధిలోని ఊర్వశీ బార్‌కు ఉద్యోగం మారింది. ఆ తర్వాత.. యువతి నిందితుడితో మాట్లాడటం తగ్గించిందని, ఫోన్ కాల్స్‌కు కూడా సరిగా స్పందించకపోవడంతోనే ఈ హత్యకు పాల్పడి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు.

**అనుమానం..**

యువతి తనను పట్టించుకోవడం లేదని, ఉద్దేశపూర్వకంగా దూరం పెడుతోందనే అనుమానం నిందితుడిలో పెరిగింది. ఈ అనుమానం క్రమంగా కోపంగా, ఆగ్రహంగా మారి చివరికి హత్యకు దారితీసింది. తనతో మాట్లాడకపోవడానికి కారణం ఏంటో తెలుసుకోవాలనే నెపంతోనే నిందితుడు యువతిని పిలిచినట్టు సమాచారం.

**మాట్లాడదామని పిలిచి..**

యువతిని బోరబండ ప్రాంతానికి నిన్న(ఆదివారం) నిందితుడు పిలిచాడు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య వాగ్వాదం జరగడంతో.. తీవ్ర కోపంతో ఆమెపై దాడికి పాల్పడ్డాడు. పదునైన ఆయుధంతో యువతిని హత్య చేసినట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. సంఘటనా స్థలంలోనే యువతి మృతిచెందినట్టు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైంది.

**మహిళల భద్రతపై ఆందోళన...**

ఈ ఘటన బోరబండ పరిసర ప్రాంతాల్లో తీవ్ర కలకలం రేపింది. జనసాంద్రత ఎక్కువగా ఉండే ప్రాంతంలో ఇలాంటి ఘటన జరగడం స్థానికులను భయాందోళనలకు గురిచేసింది. ముఖ్యంగా రాత్రి వేళ ఉద్యోగాలు చేసే యువతుల భద్రతపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి.

**పోలీసుల అదుపులో నిందితుడు..**

సమాచారం అందుకున్న వెంటనే బోరబండ పోలీసులు.. సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. హత్యకు పాల్పడిన యువకుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. నిందితుడిపై హత్య కేసు నమోదు చేసి, పూర్తి వివరాలు సేకరిస్తున్నారు.

**పెరుగుతున్న ఘటనలు..**

ఇటీవల హైదరాబాద్‌లో మహిళలపై దాడులు, వేధింపులు, హత్యలు పెరుగుతున్న నేపథ్యంలో ఈ ఘటన తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. చిన్న పరిచయాలు, సోషల్ మీడియా, ఉద్యోగ స్థలాల్లో ఏర్పడే సంబంధాలు ఎలా ప్రాణాంతకంగా మారుతున్నాయో ఈ ఘటన మరోసారి స్పష్టం చేస్తోంది.

**కఠిన చర్యలు తీసుకుంటాం..**

ఈ ఘటనపై పోలీసులు తీవ్రంగా స్పందించారు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. నిందితుడికి చట్టపరంగా శిక్షపడేలా చేస్తామని బోరబండ పోలీసులు తెలిపారు.

**మృతురాలి కుటుంబంలో విషాదం..**

యువతి మృతి చెందడంతో ఆమె కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. ఉద్యోగం చేస్తూ కుటుంబానికి అండగా నిలిచిన కుమార్తెను కోల్పోవడం తల్లిదండ్రులను తీవ్రంగా కలిచివేసింది. నిందితుడికి కఠినశిక్ష విధించాలని కుటుంబ సభ్యులు డిమాండ్ చేశారు

# నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ఆర్థిక ప్రగతికి బ్యాంకర్ల భాగస్వామ్యం అవసరం

## ఎంపీ డా. మల్లు రవి

**నాగర్‌కర్నూల్, జనవరి 12 (నిజాయితీ) :** నాగర్ కర్నూల్ పార్లమెంట్ ఆర్థిక ప్రగతికి బ్యాంకర్ల భాగస్వామ్యం అవసరం, ఎంపీ డాక్టర్ మల్లు రవి గారు గత సంవత్సరం 5241 మందికి 502 కోట్ల రూపాయల రుణాల మంజూరు చేసిన బ్యాంకర్లను అభినందించిన ఎంపీ మల్లు రవి గారు నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఆర్థిక ప్రగతితో పాటు ప్రజల సంక్షేమాన్ని సాధించాలంటే బ్యాంకర్ల భాగస్వామ్యం ఎంతో అవసరమని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి గారు అన్నారు. పేద ప్రజలు ఆర్థికంగా ఎదగాలంటే చిన్న పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలని ఆయన సూచించారు. ఉపాధి అవకాశాల పెంపుతో పాటు స్వయం ఉపాధి దిశగా ప్రజలను ముందుకు నడిపించడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలన్నారు. సోమవారం సాయంత్రం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి గారు అధ్యక్షత వహించగా, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ గారు , జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ గారు , నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి గారు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విశ్వకర్మ యోజన, పీఎంఈజీపీ, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ, గ్రామీణ బ్యాంకింగ్ సేవల అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి గారు మాట్లాడుతూ.... నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఆర్థిక ప్రగతి, ప్రజల సంక్షేమానికి బ్యాంకర్ల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. పేద ప్రజలు ఆర్థికంగా ఎదగాలంటే చిన్న పరిశ్రమల స్థాపనకు బ్యాంకులు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా బ్యాంకర్లు చురుకైన పాత్ర పోషించాలన్నారు. ముఖ్యంగా స్వయం ఉపాధి, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి రుణాల మంజూరులో వేగం పెంచాలని




కోరారు. గత సంవత్సరం 5241 మంది లబ్ధిదారులకు 502 కోట్లు రూపాయల రుణాలు ఇవ్వడం పై బ్యాంకర్లను ఎంపీ మల్లు రవి అభినందించారు. పి ఎం ఈ జి పి ద్వారా జిల్లాలో 63 యూనిట్లలకు 184.06 కోట్ల రూపాయలు రుణాలు విడుదల చేశారని, ఇదేవిధంగా రానున్న సంవత్సరాలలో కూడా ప్రజలకు మరింత ఎక్కువ మొత్తంలో రుణాలు అందజేసిన బ్యాంకర్లు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు. ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి గారు మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక రకాల పథకాలను అమలు చేస్తుందని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బ్యాంకర్లు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్ గారు లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, బ్యాంకు మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలు అమలు

**గుజరాత్, జనవరి 12 (నిజాయితీ) :** రిజిస్ట్రేషన్ శాఖలో కీలక సంస్కరణలు అమలుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖను పూర్తిగా పారదర్శకంగా అవినీతి రహితంగా తీర్చిదిద్దుతున్నట్లు రాష్ట్ర రెవెన్యూ హౌసింగ్ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. కూకట్పల్లి కైతలాపూర్ సమీపంలోని హౌసింగ్ బోర్డ్ స్థలంలో ఎస్ఎస్ఆర్ బిల్డర్స్ నిర్మిస్తున్న ఇంటిగ్రేటెడ్ సబ్ రిజిస్టర్ కార్యాలయానికి సోమవారం మంత్రి శంకుస్థాపన చేశారు. స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రజలకు సౌకర్యం పరిపాలనకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అత్యధిక సౌకర్యాలతో కార్పొరేట్ స్థాయి ప్రమాణాలతో సమీకృత సబ్ రిజిస్టర్ కార్యాలయాలను రాష్ట్రవ్యాప్తంగా దశలవారీగా నిర్మిస్తున్నామని మంత్రి తెలిపారు. మొదటి దశలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలో, రెండో దశలో జిల్లా కేంద్రంలో, మూడో దశలో నియోజకవర్గ కేంద్రాల్లో సమీకృత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. మొదటి దశలో ఔటర్ రింగ్ రోడ్డు పరిధిలోని హైదరాబాదు రంగారెడ్డి మేడ్చల్ సంగారెడ్డి నాలుగు జిల్లాల్లోని 33 సబ్ రిజిస్టర్ కార్యాలయాలను 12 కష్టాలుగా విభజించి భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటికే గచ్చిబౌలిలోని తెలంగాణ అకాడమీ ఆఫ్ ల్యాండ్ ఇన్ఫర్మేషన్ అండ్ మేనేజ్మెంట్ భవనంలో సమీకృత సబ్ రిజిస్టర్ కార్యాలయ నిర్మాణానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా శంకుస్థాపన చేయడం జరిగిందని, జూన్ నాటికి భవనాన్ని ప్రారంభించుకుంటామని వెల్లడించారు. ప్రభుత్వంపై ఆర్థిక భారం పడకుండా బిల్డర్స్ తోనే 12 సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని తెలిపారు. అంతేగాక సమీకృత భవనాలు నిర్మించే సంస్థలే కనీసం ఐదేళ్లపాటు వాటిని నిర్వహించాలన్న నిబంధన కూడా పొందుపరచమని మంత్రి తెలిపారు ఇక్కడ కొత్తగా పెళ్లయి రిజిస్ట్రేషన్ కి వచ్చే జంటలు చిన్న పిల్లలతో వచ్చే తల్లులు పేదలకు సకల సౌకర్యాలు ఉంటాయని వెల్లడించారు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖను ఆదాయవనరుగా కాకుండా సేవా కేంద్రంగా చూస్తుందని స్పష్టం చేశారు గత రెండేళ్లుగా రాష్ట్ర వ్యాప్తంగా కేవలం రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు డబ్బు చేకూర్చాలని ఆలోచన కాకుండా పేదవారిని దృష్టిలో పెట్టుకొని వివిధ సంస్కరణ తెచ్చామని మంత్రి తెలిపారు .పేదలకు గతంలో ఇచ్చిన భూములతో పాటు ప్రభుత్వ భూములను పరిరక్షిస్తామని, ప్రభుత్వ భూములను చెరబట్టే అక్రమార్కులను ఉక్కు పాదంతో అణచివేస్తామని వెల్లడించారు. ప్రతిపక్షాలతో విమర్శించుకునే పరిస్థితి రాకుండా పేదల పక్షాన ప్రభుత్వం పని చేస్తుందని స్పష్టం చేశారు .

మంగళవారం
జనవరి 13, 2026
TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితి
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# ఆర్థిక అసమానతలో అగ్రస్థానం భారత్‌దే



ప్రపంచ అసమానతల నివేదిక 2026 మూడవదిగా వెలువడుతున్నది. 2018, 2022 తర్వాత కీలకమైన సిరీస్‌గా ఇది వస్తున్నది. ప్రపంచవ్యాపితంగా రెండువందల మందికి పైగా మేధావుల కృషి ఆధారంగా ఇది కూర్పు చేయబడింది. వారు ప్రపంచ అసమానతల అధ్యయన ప్రయోగశాలతో అనుబంధంగా ఉంటున్నారు. ప్రపంచ అసమానతల చారిత్రక పెరుగుదలకు సంబంధించిన అతి పెద్ద డేటా సేకరణకు వారు దోహదపడుతున్నారు. అసమానతలకు సంబంధించి ప్రపంచవ్యాపిత చర్చలకు ఈ సమిష్టి కృషి గొప్పగా సహాయపడగలదు. విధాన నిర్ణేతలు, పౌరులు, అసమానతల తీవ్రతనూ, కారణాలనూ అర్థం చేసుకునే తీరును మార్పు చేయడానికి ఈ బృందం కృషి సహాయ పడింది. అమెరికా, బ్రెజిల్, దక్షిణాఫ్రికాల కన్నా భారతదేశంలోనే అసమానతలు ఆకాశమంటుతున్నాయి. భారతీయ సంపన్నులకూ పేదలకూ మధ్య అంతరం ఎంత భారీగా ఉందంటే ఒకవిధంగా చూస్తే బ్రిటిష్ వలస పాలనలోనే ఈ సంపద పంపిణీ ఇప్పటికన్నా కొంత సమానతతో ఉండేది.'ప్రపంచంలో రోజురోజుకు పెరుగుతున్న ఆర్థిక అసమానతల పట్ల 'వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ రిపోర్ట్ 2026' ఆందోళన వ్యక్తపరిచింది. ప్రపంచంలోని అత్యధిక సంపద కేవలం కొద్దిమంది ధనవంతుల చేతుల్లోనే కేంద్రీకృతమై ఉందని ఈ నివేదిక స్పష్టం చేసింది. నివేదిక ప్రకారండ ప్రపంచ జనాభాలో 0.001 శాతం అంటే దాదాపు 56,000 మంది వ్యక్తులు. అంటే 56 వేల మంది వద్దే ప్రపంచ సంపద ఉన్నట్లు తెలుస్తోంది. ఈ గణాంకాలు ధన, ఆదాయ అసమానతలు పెరగడం మాత్రమే కాకుండాడ ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు, ప్రజాస్వామ్యానికి కూడా పెను ముప్పుగా మారుతోందని నివేదిక హెచ్చరించింది. ప్రపంచంలో ప్రతిదేశంలో అగ్రస్థానంలో ఉన్న 1 శాతం మంది వద్ద, దిగువన ఉన్న 90 శాతం మంది వద్ద ఉన్న మొత్తం సంపద కంటే ఎక్కువ ఆస్తి ఉంది. 1990 నుంచి బిలియనీర్లు, మిలియనీర్ల సంపద ప్రతి సంవత్సరం దాదాపు 8 శాతం చొప్పున పెరిగింది. ఇదే సమయంలో జనాభాలో దిగువ సగం మంది సంపద వృద్ధిరేటు దీనిలో సగం కంటే తక్కువగా ఉంది (సుమారు 4శాతం).దేశం అభివృద్ధిలో దూసుకుపోతోందని ఢిల్లీలో మోడీ సర్కార్ నిత్యం వేసే డప్పు మేళాను ప్రపంచ అసమానతల నివేదిక–2026 ఒక్కసారిగా పటాపంచలు చేసింది. వరల్డ్ ఇన్ ఈక్వాలిటీ రిపోర్టు విడుదల చేసిన రిపోర్టును పరిశీలిస్తే అన్ని దేశాల్లోకెల్లా ఆర్థిక అసమానతలు భారత్‌లోనే ఎక్కువగా ఉన్నాయని తేటతెల్లమైంది. 'విభజించు, పాలించు' నినాదం మన ఏలికలకు కొత్తేం కాదు. కానీ ఇక్కడ చూస్తున్నది నిజమైన భారతదేశం రెండు ముక్కలై కనిపిస్తోంది. ఒకటి సంపదను కూడబెట్టే వర్గం కాగా మరొకటి జీవనోపాధి కోసం పోరాడే జన సమూహం. దేశ ఆదాయంలో యాభై ఎనిమిది శాతం కేవలం పది శాతం మంది చేతుల్లోనే ఉందంటే నమ్మగలమా? కానీ నమ్మి తీరాలి. ఇది యాదృచ్ఛికం కాదు. పదకొండేండ్లుగా మోడీ సర్కార్ అమలు చేస్తున్న కార్పొరేట్–కేంద్రీకృత విధానాల ఫలితం. వృద్ధి అనే గొప్ప అబద్ధం వెనుక భారత పేదల ముఖంపై అసమానత అనే నిజం నిలబడిపోయింది. పాలకులు, పెట్టుబడిదారులు కలిసి లిఖిస్తున్న వివక్ష చరితం. పాలకులు సమాధానం చెప్పాలి. ఇదేనా 'వికసిత్ భారత్'?భారతదేశంలో ఆదాయ అసమానతలు ప్రపంచ దేశాల్లోకెల్లా అత్యధికంగా ఉన్నాయి. ఆర్థికవేత్తలు లూకాస్ చాన్సెల్, రికార్డో గోమెజ్–కారెరా, రొవాడియా మోషరీఫ్, థామస్ పికెటిలు రూపొందించిన, తాజాగా విడుదలైన ప్రపంచ అసమానతల నివేదిక–2026 ఈ విషయాలను తేటతెల్లం చేసింది. దేశ సంపదలో 58 శాతం కేవలం పది శాతం మందికే చేరుతోందని వరల్డ్ ఇన్ ఈక్వాలిటీ నివేదిక వెల్లడించింది. దేశం ఆర్థికంగా ఎంతో వృద్ధి చెందినా అభివృద్ధి ఫలాలు అందరికీ చెందడం లేదన్న ఆరోపణల్లో అసత్యం లేదని ఈ నివేదిక తెలియజేస్తోంది. స్వాతంత్ర్యం వచ్చిన కొత్తలో దేశసంపద అంతా టాటాలు, బిర్లాలకే దక్కుతోందని వామపక్షాల వారు విమర్శించేవారు. ఇప్పుడు అలాంటి కుబేరుల సంఖ్య ఎంతో పెరిగింది. గరిష్ట, కనిష్ట ఆదాయాల మధ్య వ్యత్యాసం బాగా పెరిగిందని ఆ నివేదిక వివరించింది. సంక్షేమ పథకాలను గురించి పదే పదే చెబుతూ, సమ్మిళిత అభివృద్ధి కోసమే వీటిని అమలు జేస్తున్నామని చెబుతున్నారు. సంక్షేమ పథకాల ఫలాలు ఎవరికి చెందాలో వారికి చేరకపోవడం వల్ల సమ్మిళిత అభివృద్ధి జరగడం లేదు. అగ్రశ్రేణిలో ఉన్న 10 శాతం ధనవంతులకూ, అట్టడుగున ఉన్న 50 శాతం మంది పేదల మధ్య 2014 నుంచి 2024 వరకూ ఆదాయంలో అంతరాలు స్థిరంగా కొనసాగు తున్నాయని ఆ నివేదిక సూచిస్తోంది. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన 2014 నాటి నుంచి మొదటి పదేళ్ళలో వ్యత్యాసాలు బాగా పెరిగాయి. అంతరాలను తగ్గించడానికి కృషి చేస్తున్నట్టు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రతి సందర్భంలోనూ పేర్కొంటున్నారు. అయితే, ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాల నిధులన్నీ అగ్రశ్రేణిలో ఉన్న పది శాతం మందికే చేరుతున్నాయని అసమానతల నివేదిక పేర్కొంటోంది. అలాగే, దేశంలో కుబేరుల సంఖ్య బాగా పెరుగుతోందనీ, గడిచిన పదేళ్ళలో కొత్త కుబేరులు తయారయ్యారని అసోసియేషన్ ఫర్ డెమోక్రాటిక్ రైట్స్ (ఎడిఆర్) ఎన్నికల సందర్భంగా విడుదల చేసే నివేదికల్లో పేర్కొంటోంది. గతంలో బిలియనీర్ల సంఖ్య చాలా తక్కువగా ఉండేది. ఇప్పుడు అలాంటి బిలియనీర్లు లెక్కకు మిక్కిలిగా పెరిగారు.రాష్ట్రాల్లో పెట్టుబడుల కోసం విదేశాల్లో పర్యటించే మంత్రులు, ముఖ్యమంత్రుల సంఖ్య గతంలో కన్నా బాగా పెరుగుతోంది. అయితే, విదేశాల నుంచి పెట్టుబడులు ఆశించినంత రావడం లేదన్న సమాచారం కూడా వెలువడుతోంది. విదేశీ సంస్థలకు భూమి, నీరు, ఇతర మౌలిక సదుపాయాలను కల్పిస్తున్నా, బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పిస్తున్నా, మౌలిక సదుపాయాలను, బ్యాంకు రుణాలను పొందిన వారు పరిశ్రమలు, యూనిట్లను స్థాపించడం లేదనీ, ఆ సొమ్మును రియల్ ఎస్టేట్ రంగంలో పెట్టుబడులుగా పెడుతున్నారన్న విమర్శలు తరచూ వస్తున్నాయి. జనాభాలో అధిక సంఖ్యాకులు పరిమితమైన సంపదతోనే జీవిస్తున్నారనీ, దేశంలో సగటు ఆదాయం 7,273 డాలర్లుగా ఉందనీ, కొనుగోలు శక్తి పెరగడం లేదని నివేదిక వివరించింది. మహిళా కార్మికుల భాగస్వామ్యం తక్కువగా ఉండటం ఇందుకు ఒక కారణంగా చెబుతున్నారు. మహిళా కార్మిక శక్తి ఆదాయం గడిచిన థాబ్ద కాలంలో ఏమాత్రం పెరగలేదనీ, ఆర్థిక అసమానతలు లింగ అసమానతలు సమాజంలో పాతుకుని పోయాయనీ, కార్మిక రంగంలో స్త్రీ, పురుషుల వేతనాల మధ్య వ్యత్యాసం ఇంకా కొనసాగుతోందని వరల్డ్ ఇన్‌ఈక్వాలిటీ నివేదిక వివరించింది.'వికసిత్ భారత్', 'అచ్చేదిన్' అంటూ ఊదరగొట్టే ప్రధాని మోడీ హయాంలో పేదలకు ఒరిగిందేమీ లేదని మరోసారి రుజువైంది. కార్పొరేట్లకు కొమ్ముకాసే ఎన్డీయే ప్రభుత్వంలో మిలియనీర్లు బిలియనీర్లుగా మారుతుంటే, పేదలు మాత్రం నిరుపేదలుగానే మిగులుతున్నారు. ఆదాయ అసమానతల్లో భారత్ మరోసారి అగ్రస్థానంలో నిలిచింది. ఈ మేరకు విడుదలైన ఇనీక్వాలిటీ రిపోర్ట్ (ప్రపంచ అసమానతల నివేదిక (ఆర్థిక) 2026లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. సంపద ఒకవైపే పోగుబడటం, పేదలు మరింత పేదరికంలోకి దిగజారడం వెనుక మోడీ సర్కార్ అసమర్థత కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నది. గద్దెనెక్కిందే పెట్టుబడిదారుల కోసమా అన్న చందంగా పాలన ఉన్నది. జిఎస్‌టి అన్ని వర్గాల ప్రజల కోసమంటూ నమ్మించి అమలులో మాత్రం పెట్టుబడిదారుల ప్రయోజనాలనే నెరవేర్చింది. స్లాబుల సవరణ వల్ల ఉత్పత్తి ఆధారిత పెద్ద కంపెనీల పన్ను భారం తగ్గింది. వినియోగదారులు, ముఖ్యంగా పేద, కింది తరగతులకు మాత్రం పరోక్షంగా పన్నుల భారం పెరిగింది. పైగా కార్పొరేట్ల ఒత్తిడి మేరకే ఈ శ్లాబుల నిర్ణయం చేసి 'జిఎస్‌టి బచావ్' అంటూ ప్రచారం లంకించు కోవడం కేంద్ర సర్కార్‌కే చెల్లింది. దశాబ్దకాలంగా దేశంలో ఎలాంటి పురోగతి లేదన్నది వాస్తవం. ఆదాయాలు, సంపద, లింగ వైవిధ్యత వంటి పలు అంశాల్లో భారతదేశంలో అసమానతలు చాలా లోతుగా పాతుకుపోయాయి. వీటివల్ల ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న వ్యవస్థాగతమైన విభేదాలు తారాస్థాయికి చేరాయి. ఇది ఎవరో చెప్పింది కాదు, ఆర్థికవేత్తలు జయతి ఘోష్, జోసెఫ్ స్టిగ్లిట్జ్‌లు ఈ నివేదికకు ముందుమాటలో రాసిన మాటలు. అంతర్జాతీయంగా సంపద అత్యంత అసమానమైన రీతిలో పంపిణీ కావడం ఆందోళనకరం. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 11 ఏండ్ల కాలంలో పేద, ధనిక వర్గాల మధ్య అంతరంలో ఏ మాత్రం మార్పు రాకపోగా, ఈ అంతరం స్వల్పంగా పెరిగినట్టు నివేదికలోని గణాంకాలను బట్టి అర్థమవుతున్నది. పేద, ధనిక వర్గాల మధ్య ఆదాయం అసమానతలు 2014లో 38 శాతంగా ఉంటే, అది 2024 నాటికి 38.32 శాతంగా ఉన్నట్టు నివేదిక తెలిపింది. శ్రామిక రంగంలో మహిళల భాగస్వామ్యంలో కూడా ఏమాత్రం పెరుగుదల కనిపించలేదని నివేదిక పేర్కొంది. 2014లో 15.7 శాతంగా ఉన్న మహిళా శ్రామికశక్తి, 2024 నాటికి కూడా 15.7 శాతంగానే ఉన్నట్టు నివేదిక వెల్లడించింది.ప్రపంచ మానవాభివృద్ధి ప్రగతి గడచిన మూడున్నర దశాబ్దాల్లో అత్యంత తక్కువ నమోదు కావడం పట్ల మొన్న ఐక్యరాజ్య సమితి చీఫ్ అంటానియో గుటెరస్ వ్యక్తపర్చిన ఆందోళన మానవాళికి హెచ్చరిక. కరోనా మహమ్మారితో పూర్తిగా రెండు సంవత్సరాలు ఆర్థిక వ్యవస్థ స్తంభించిన అనంతరం మానవాభివృద్ధిలో సుస్థిరత నెలకొని మరింత మెరుగుదల దిశగా పయనించాల్సింది పోయి అధమ స్థాయికి దిగజారడం ఆత్మ విమర్శనా పూర్వకంగా ఆలోచించాల్సిన విషయం. 2024 సంవత్సరానికి ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) ప్రపంచ మానవాభివృద్ధి నివేదికను వెలువరించింది. కృత్రిమ మేధ యుగంలో ప్రజలు, అవకాశాలపై నివేదిక విశ్లేషించింది. మానవాభివృద్ధి ప్రగతి నిర్ణయించుకున్న లక్ష్యాలకనుగుణంగా లేదు. మానవాభివృద్ధి తక్కువ ఉన్న దేశాలు, ఎక్కువ ఉన్న దేశాల మధ్య అసమానతలు తీవ్ర స్థాయిలో ఉన్నాయని నివేదిక కుండబద్దలు కొట్టింది. ఈ అసమానతలు వరుసగా నాల్గవ తడవ కూడా మరింతగా విస్తరించడం ఆందోళన కలిగించే విషయం.సమాజంలో ఆర్థిక అసమానతలు, లింగ వివక్ష ఆందోళన కలిగిస్తున్నాయి. దేశంలో శత కోటీశ్వరుల సంఖ్య అంతకంతకూ పెరుగుతోందని ఫోర్బ్స్ సహా పలు అంతర్జాతీయ సంస్థలు ఎప్పటికప్పుడు వెల్లడిస్తూనే ఉన్నాయి. వాటికి అభిముఖంగా దిగజారుతున్న పేదరికం వృద్ధి, ప్రజల కొనుగోలు శక్తి తరుగుదల, పారిశ్రామిక మందగమనం, ఉపాధి అవకాశాల తగ్గుదల, పోషకాహార లోపం, పాఠశాలల్లో డ్రాపవుట్స్, బాలకార్మిక సమస్యలు పీడిస్తున్నాయి. ప్రపంచ ఆకలిసూచిలో ఇండియా స్థానం చిట్టచివరిలో ఊగిసలాట అసమానతల తీవ్రతకు ప్రతిరూపం. 2023–24లో ఫీమేల్ లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేటు 41.71 శాతానికి పెరిగిందని కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సర్వేలో ఉటంకించింది. దీనికి కారణం గ్రామాల్లో మహిళల శ్రమ పెరిగిందని అర్థం. మహిళా శక్తి సద్వినియోగం కావాలంటే మహిళలు ఉద్యోగాల్లో చేరే వాతావరణం నెలకొల్పబడాలి. వారు తమ ఉద్యోగాలను నిలుపుకునే అవకాశాలు సృష్టించబడాలి. ప్రస్తుతం ఆ పరిస్థితులు తక్కువేనన్నది నిపుణుల మాట. రాజకీయ భాగస్వామ్యంలో మహిళల వెనుకబాటు కొనసాగుతోంది. చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్లు ఎప్పటికీ సాకారమవుతాయో తెలియకుండా ఉంది. ఈ పరిస్థితుల్లో మార్పు రాకుండా మానవాభివృద్ధి పెరగదన్నది కఠోర నిజం. ఆదాయ, లింగ అసమానతలు భారతదేశ మానవాభివృద్ధి ప్రగతిని 30.7 శాతం తగ్గించాయి.నయా ఉదారవాద విధానాలను అమలు చేస్తున్న ఫలితంగా అత్యవసర సేవలైన వైద్యం, విద్య వంటివి అంతకంతకూ అధికంగా ప్రైవేటు రంగం చేతుల్లోకి పోతున్నాయి. ఆదాయాల అంతరాలు పెరిగిపోవడంలో దీని పాత్ర చాలా ఉంది. సంపన్నులు ఎప్పుడూ ఖరీదైన ప్రైవేటు వైద్యానికే పోతూంటారు. పేదవారు ప్రభుత్వ వైద్య సంస్థల సేవలను ఉపయోగించుకుంటారు. ఎప్పుడైతే ప్రభుత్వ వైద్య వ్యవస్థ కుదించుకుపోతూ ఉంటుందో, అప్పుడు ఆ పేదవారు సైతం అనివార్యంగా ప్రైవేటు వైద్య సేవల వైపు మళ్ళవలసి వస్తుంది. దాని వల్ల వారి ఖర్చు పెరుగుతుంది. ఒకపక్క ఆదాయాలు తగ్గిపోతున్నా, మరొకవైపు ఖర్చు పెరుగుతుంది. ఈ పెరిగిన ఖర్చును చూపించి ధనిక, పేద వర్గాల మధ్య అంతరాలు తగ్గిపోతున్నట్టు చెప్పుకోవడం కన్నా అసంబద్ధమైనది ఉంటుందా? ఇలా వైద్యం నిమిత్తం ఖర్చు పెరిగిపోయినప్పుడు పేదలు అనివార్యంగా ఇతర ఖర్చులను తగ్గించుకోవడానికి ప్రయత్నిస్తారు. అందువల్లే వారి ఆహార ఖర్చు తగ్గుతుంది. అది కాకపోతే వారు అప్పులు చేస్తారు. అందుచేత అంతరాలు తగ్గిపోయాయంటూ ప్రభుత్వం చెప్పుకుంటున్నది వాస్తవ చిత్రానికి పూర్తి విరుద్ధం. ప్రభుత్వ ఆస్పత్రులలో విపరీతమైన రద్దీ కారణంగా సకాలంలో వైద్యం అందకపోవడం, లేదా, అక్కడ ఆలస్యం అవుతున్నందున ప్రైవేటు ఆస్పత్రులకు పోయి అక్కడ బిల్లులు కట్టలేక, వైద్యం పొందలేక బిడ్డల్ని పోగొట్టుకోవడం వంటి సంఘనలతో వార్తాపత్రికల్లో మనకు ప్రతిరోజూ కనిపిస్తూనే ఉన్నాయి. ప్రజలకు అత్యవసరమైన సేవలను ప్రైవేటుపరం చేసి వాటిని ఖరీదైనవిగా మార్చి, పేదలను మరింత కష్టాలపాలు చేయడమే కాకుండా, తమ విధానాల వల్ల సమాజంలో ధనిక, పేద అంతరాలు తగ్గిపోయాయంటూ ప్రచారం చేసుకోవడం ఈ ప్రభుత్వపు బాధ్యతారాహిత్యానికి అద్దం పడుతోంది.అంతర్జాతీయంగా సంపద చారిత్రక ఎత్తులకు చేరుకుంది. కానీ అత్యంత అసమాన రీతిలో పంపిణీ అవుతోంది. అగ్ర స్థానంలో ఉన్న 0.001 శాతం మంది అంటే 60వేల కన్నా తక్కువ మంది కోటీశ్వరులు కింది స్థాయిలోని మానవాళి వద్ద మొత్తంగా గల సంపద కన్నా మూడు రెట్లు ఎక్కువ సంపదను కలిగి ఉన్నారు. వారి వాటా నిలకడగా పెరుగుతూనే ఉంది. దాదాపు 4శాతం నుండి ఈనాడు 6శాతానికి పైగా చేరుకుంది. పైగా అంతర్జాతీయ స్థాయిలో అసమానతలు పెచ్చరిల్లడం, బహుళపక్షవాదం బలహీనపడడం వంటి పరిణామాల నేపథ్యంలో ఈ ధోరణి చోటు చేసుకుందని ప్రపంచ అసమానతల నివేదిక 2026 పేర్కొంది. ఈ పరిస్థితులను మార్చాలంటే ప్రభుత్వాలు విధానపరమైన మార్పులు తీసుకురావాలని పేర్కొంది. విద్య, సార్వజనీన ఆరోగ్య సంరక్షణ, నగదు బదిలీలు, పెన్షన్లు వంటి పునఃపంపిణీ కార్యక్రమాల్లో ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులు పెట్టాలని సూచించింది. ప్రగతిశీల పన్నుల విధానం, సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని కోరింది.

ఎ నర్సింహా రెడ్డి

# ఘనంగా ప్రియాంకా గాంధీ జన్మదిన వేడుకలు

**మహబూబ్‌నగర్, జనవరి 12 (నిజాయితి) :** అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసిసి) ప్రధాన కార్యదర్శి, లోక్‌సభ సభ్యురాలు శ్రీమతి ప్రియాంకా గాంధీ జన్మదిన వేడుకలను మహబూబ్‌నగర్ జిల్లా డీసీసీ కార్యాలయంలో మహబూబ్ నగర్ జిల్లా డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలోమార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనితా రెడ్డి, డీసీసీ ఉపాధ్యక్షులు సత్తూర్ చంద్రకుమార్ గౌడ్ గారు,డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ అజ్మత్ అలీ,ఎంపీ ప్రవీణ్ కుమార్, అబ్రార్, శ్రీనివాసులు, నిర్మలాదేవి, చందు యాదవ్, శ్రీధర్, బాలస్వామి, ఫయాజ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## భవిష్యత్ తరాలకు ఆదర్శం వివేకానందుని స్ఫూర్తి

# ఘనంగా యువజన దినోత్సవం

**తెల్కపల్లి, జనవరి 12 (నిజాయితి) :** భవిష్యత్ తరాలకు స్ఫూర్తి స్వామి వివేకానందుడు దేశానికి అందించిన ఆదర్శాలు అని మాజీ ఎంపిటిసి అతినారపు విజయలక్ష్మి, యాదయ్యలు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని స్వామి వివేకానంద164వ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా జయంతి ఉత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వివేకానందుని స్ఫూర్తితో యువకులు దేశ అభివృద్ధికి పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో బాజపా మండల పార్టీ అధ్యక్షులు చిన్నారెడ్డి, అనిల్ కుమార్ రావు, చంద్రశేఖర్, మారోజు ఉమాపతి, రామకృష్ణ, వివిధ పార్టీల నాయకులు, వివేకానంద యువజన సంఘం నాయకులు, ఉద్యోగులు, యువకులు పాల్గొన్నారు.



# ప్రజా పాలన ఫలాలు ఇంటింటికి అందుతున్నాయి

## - గౌరెడ్డిపల్లి సర్పంచ్ జిల్కర శిరీష



**తెల్కపల్లి, జనవరి 12 (నిజాయితి) :** రేవంత్ రెడ్డి నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ప్రజా పాలన సంక్షేమ ఫలాలు ఏదో ఒక రూపంలో ప్రతి ఇంటికి అందుతున్నాయని గౌరెడ్డిపల్లి సర్పంచ్ జిల్కర శిరీష ఈశ్వర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని గౌరెడ్డిపల్లిలో సోమవారం ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలలో ఇచ్చిన ఆరు గ్యారంటీలు తూచతప్పకుండా ఒక్కొక్కటిగా అమలు చేస్తుందని అన్నారు. ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఇందిరమ్మ ఇళ్లు అర్హులందరికి అందుతున్నాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆలస్యమైనప్పటి 18 సంవత్సరాలు నిండిన ప్రతి మహిళకు నాణ్యమైన చీరలు పంపిణీ చేయాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉందని గ్రామాలలో అర్హులైన ప్రతి మహిళకు చీరలు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. గౌరెడ్డిపల్లి గ్రామాన్ని ఎంఎల్ ఏ కూచుకుళ్ళ రాజేష్ రెడ్డి మాడల్ గ్రామంగా గుర్తించి అన్నిరకాల అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని అందులో భాగంగానే మండలంలో అన్ని గ్రామాలకన్న అధికంగా 35 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులతో సి సి రోడ్లు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ కోసం నిధులు కేటాయించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జిల్కర శిరీష ఈశ్వర్‌తో పాటు, ఉప సర్పంచ్ సూర్య బాలగౌడ్. వార్డు సభ్యులు కొమ్ముల కృష్ణయ్య, ఎం.నరేందర్ రెడ్డి, సూర్యనిర్మలమ్మ, పుల్జాల స్వప్న. అతినారపు చెన్నమ్మ, అతినారపు చిన్నరాజు, ఎల్లికంటి మనోహర్, గడ్డం లక్ష్మణ్. మాజీ సర్పంచ్ చెన్ రెడ్డి వెంకట్ రెడ్డి, గ్రామ పెద్దలు సూర్య శంకర్ గౌడ్, సందరాజ శేఖర్, సంగిసెట్టి కర్ణాకర్, చిట్టగొండ మల్లేష్ జిల్కర పరుష రాముడు జిల్కర ఆంజనేయులు, గ్రామపంచాయితీ కార్యదర్శి వీరాస్వామి, మండల మహిళా సంఘాలు సభ్యులు పాల్గొన్నారు.

## పేద ఆర్యవైశ్యులకు అండగా నిలుస్తా - ఎమ్మెల్యే



**నాగర్‌కర్నూల్, జనవరి 12 (నిజాయితి) :** పేద ఆర్యవైశ్యులకు అండగా ఉండేందుకు నిరంతరం అందుబాటులో ఉంటానని స్థానిక ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు సోమవారం జిల్లా కేంద్రంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయ ఆవరణలో ఇటీవల నూతనంగా ఏర్పాటు చేసిన సీసీ రహదారి పనులను ఆయన ప్రారంభించారు అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించిన అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారిని సుందరంగా తీర్చిదిద్దరుకు తన వంతు కృషి చేస్తానని అందుకు ఆర్యవైశ్యుల సహాయ సహకారాలు కావాలని కోరారు. రహదారి నిర్మాణాలతో వివిధ ప్రవేట్ కంపెనీలు కూడా జిల్లా కేంద్రంలో నెలకొల్పే అవకాశాలు ఉన్నాయని ఆ దిశగా ప్రయత్నాలు సాగుతున్నాయన్నారు. నియోజకవర్గాన్ని సుందరంగా తీర్చిదిద్ది రాష్ట్రంలో అగ్రస్థానంలో నిలిపేందుకు తాను కృషి చేస్తున్నానని తన ఐదు సంవత్సరాల పదవీకాలంలో నియోజకవర్గాన్ని విద్యాహబ్ గా తీర్చిదిద్దుతానన్నారు ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షులు వాసా ఈశ్వరయ్య తో పాటు పలువురు ఆర్యవైశ్య ప్రముఖులు సేవా సంస్థల నిర్వాహకులు మరియు మాజీ కౌన్సిలర్స్ ,నాయకులు పాల్గొన్నారు

## స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే



**నాగర్‌కర్నూల్, జనవరి 12 (నిజాయితి) :**

స్వామి వివేకానంద జయంతి కార్యక్రమంలో పాల్గొన్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారు నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని 10వ వార్డు పరిధిలో, స్వామి వివేకానంద జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో మన ప్రియతమ నేత, నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. వాసవి క్లబ్ క్లాస్మేట్ క్లబ్ ఆహోపనిధులు పాల్గొన్నారు

## యంగ్ ఇండియా సమీకృత విద్యా సంస్థల నిర్మాణాలను వేగవంతం చేయాలి- బట్టి విక్రమార్క



**నాగర్‌కర్నూల్, జనవరి 12 (నిజాయితి) :**

యంగ్ ఇండియా సమీకృత విద్యా సంస్థల నిర్మాణాలను వేగవంతం చేయాలి, ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క, ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలను వేగవంతం చేసేలా జిల్లా యంత్రాంగం పటిష్ట చర్యలు తీసుకుంటాం, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ తెలంగాణ విద్యార్థులను ప్రపంచ మేటీ విద్యార్థులను తయారు చేసేలా రాష్ట్ర ప్రభుత్వం యంగ్ ఇండియా విద్యా సంస్థల ఏర్పాటు చేయడం జరుగుతుందని, నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టర్లు నిరంతరం పర్యవేక్షణ చేయాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలెక్టర్లను అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం హైదరాబాదు సెక్రటేరియట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అట్లూరి లక్ష్మణ్, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, రాష్ట్రంలో అధికారులు గణపత్ రెడ్డి తో కలిసి జిల్లాల కలెక్టర్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల స్థల సేకరణ నిర్మాణాలపై సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క మాట్లాడుతూ....విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా, బడుగు బలహీన వర్గాల పిల్లలకు మంచి నాణ్యమైన విద్య అందించేందుకు సీఎం రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నామని అన్నారు.యంగ్ ఇండియా సమీకృత విద్యా సంస్థల క్రింద ప్రభుత్వం పాఠశాలలను మంజూరు చేసిందని, వాటి అన్నిటి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఎక్కడైనా స్థల సేకరణలో ఇబ్బందులు ఉంటే కలెక్టర్లు వెంటనే పరిష్కరించి వాటిని నిర్మాణ సంస్థలకు అందజేయాలని ఉప ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి హాజరైన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....నాగర్ కర్నూల్ జిల్లాలో నాగర్ కర్నూల్ కొల్లాపూర్ అచ్చంపేట నియోజకవర్గం మంజూరైన యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల నిర్మాణాలకు కావలసిన స్థల సేకరణను పూర్తిచేసి నిర్మాణ సంస్థలకు అప్పగించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. కొల్లాపూర్ నియోజకవర్గానికి సంబంధించిన పాఠశాల జట్రపోల్ లో నిర్మాణ దిశలో కొనసాగుతుందని, నాగర్ కర్నూల్ నియోజకవర్గానికి సంబంధించిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు తూడుకుర్తి గ్రామంలో నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని అచ్చంపేట నియోజకవర్గానికి సంబంధించిన ఇంటిగ్రేటెడ్ పాఠశాలకు ఉప్పునుంతల మండలంలో స్థలానికి కేటాయించడం జరిగిందని పనులు ఇంకా మొదలు కాలేదని కలెక్టర్ ఉప ముఖ్యమంత్రి కి వివరించారు. పనులు వేగవంతంగా నాణ్యతతో కూడిన నిర్మాణ పనులు పూర్తి చేసేలా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ దేవ సహాయం తదితరులు పాల్గొన్నారు.

## వివేకానందుడి స్ఫూర్తితో యువత సంకల్పం, ధైర్యం, సృజనాత్మకతను పెంపొందించుకోవాలి - జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, జనవరి 12 (నిజాయితి) :**

దేశ ఔన్నత్యాన్ని ప్రపంచమంతా చాటిన గొప్ప వ్యక్తి స్వామి వివేకానంద అని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ కొనియాడారు. స్వామి వివేకానంద జయంతిని పురస్కరించుకొని జిల్లా యువజన క్రీడల సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో సోమవారం నాగర్ కర్నూల్ కలెక్టరేట్‌లో వివేకానంద స్వామి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....., స్వామి వివేకానంద సూక్తులు, ఉపన్యాసాలు ప్రపంచ నలుమూలల వ్యాపించాయని చెప్పారు. యువత వివేకానందను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని సూచించారు. ప్రతి యువతలో సంకల్పం, ధైర్యం, సృజనాత్మకతను పెంపొందించడానికి, సానుకూల ఆలోచనలకు ప్రేరణ ఇవ్వడానికి యువజన దినోత్సవం జరుపుకుంటున్నామని కలెక్టర్ తెలిపారు. స్వామి వివేకానంద మాటల్లో చెప్పాలంటే, యువత దేశానికి శక్తి, యువత మార్పుకు ప్రేరణ అని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఈ సందర్భంగా తెలియజేశారు. భారతదేశ భవిష్యత్తు యువతరం వ్యక్తిత్వం, విశ్వాసం, ఆలోచనలతోనే ఉంటుందని కలెక్టర్ తెలిపారు. 1984లో భారత ప్రభుత్వం స్వామి వివేకానంద జయంతిని జాతీయ యువజన దినోత్సవం జరుపుకుంటున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం, జిల్లా యువజన సర్వీసు క్రీడల శాఖ అధికారి సీతారాం నాయక్, డిప్యూటీ సీఈవో గోపాల్ నాయక్, జిల్లా అధికారులు డీఈఓ రమేష్ కుమార్, నర్సింగ్ రావు, చిన్న ఓబులేష్, శ్రీరాములు, అరుణ రెడ్డి, రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను వేగంగా పరిష్కరించాలి

### జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్



**నాగర్‌కర్నూల్, జనవరి 12 (నిజాయితి) :**

ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదులు, అర్జీలను వేగంగా పరిష్కరించాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లా అదనపు కలెక్టర్లు అమరేందర్, దేవ సహాయం తో కలిసి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ హాజరై ప్రజల నుంచి అర్జీలు, వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...., ప్రజా సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత అధికారులపై ఉందన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో 29 దరఖాస్తులు వచ్చాయని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులు, అర్జీలను పరిశీలించి, సత్వర పరిష్కారం చూపేలా సంబంధిత శాఖల జిల్లా స్థాయి అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. పెండింగ్ లో ఉన్న దరఖాస్తులను పరిశీలించి, వెంటనే పరిష్కరించేలా తగు చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. సీఎం, జిల్లా మంత్రి ప్రజావాణి నుంచి వచ్చిన, పెండింగ్ లో ఉన్న అర్జీలను సైతం వారంలో పరిష్కరించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో చంద్రశేఖర్, వివిధ విభాగాల సూపరింటెండెంట్, అన్ని శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం



**నాగర్‌కర్నూల్, జనవరి 12 (నిజాయితి) :** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని 8వ వార్డులో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభంనాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని 8వ వార్డు పరిధిలో ప్రజల విద్యుత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని నూతనంగా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను పేద్దలు శ్రీ గౌరవనీయులు ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి గారు మరియు నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారు సంయుక్తంగా ప్రారంభించారు.ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్ రెడ్డి గారు మాట్లాడుతూ, అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా పట్టణంలోని ప్రతి వార్డులో మౌలిక వసతులను మరింత బలోపేతం చేయడమే తమ ఉద్దేశమని తెలిపారు. ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ పరిష్కారాలు అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. కూచుకుళ్ల రాజేష్ రెడ్డి గారు మాట్లాడుతూ, గత కొంతకాలంగా 8వ వార్డులో విద్యుత్ లోడుతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో, సమస్యను పరిష్కరించేందుకు నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు నిరంతర, నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణ రావు గారు,ఆర్టీఏ మెంబెర్ గోపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగళవారం
జనవరి 13, 2026
TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితీ
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం



**నాగర్‌కర్నూల్, జనవరి 12 (నిజాయితి) :** రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా శాంతియుత వాతావరణం లో ఎన్నికలు నిర్వహించేలా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు జిల్లాల కలెక్టర్లు, మునిసిపల్ అధికారులను ఆదేశించారు. సోమవారం హైదరాబాదు సెక్రటేరియట్ నుండి రాష్ట్ర మున్సిపల్ శాఖ ముఖ్య కార్యదర్శి డాక్టర్ టీకే శ్రీదేవితో కలిసి జిల్లాల కలెక్టర్లు మునిసిపల్ అధికారులతో మున్సిపల్ ఎన్నికల ఏర్పాట్లపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.....మున్సిపల్ ఎన్నికలను శాంతియుత వాతావరణం లో సమర్థవంతంగా నిర్వర్తించేలా అధికారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలకు అనుగుణంగా ఎన్నికలను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్లను ఆయన ఆదేశించారు. ఎన్నికల నియమ నిబంధనల ప్రకారం ఎన్నికలు జరిగేలా అధికారులు అవసరమైన ముందస్తు ఏర్పాట్లతో పాటు పోలింగ్ కేంద్రాల ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు.నాగర్ కర్నూల్ కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరైన జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ.....నాగర్ కర్నూల్ జిల్లాలోని మూడు మున్సిపాలిటీలో నాగర్ కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి మున్సిపాలిటీలోని 65 వార్డుల్లో నేడు ఓటర్ల తుది జాబితా విడుదల చేయడం జరిగిందని కలెక్టర్ తెలిపారు.పోలింగ్ కేంద్రాల వారిగా ఈ నెల 16వ తేదీన ఓటర్ల జాబితా విడుదల చేయనున్నట్లు తెలిపారు.ఎన్నికల నిర్వహణకు సిబ్బంది పోలింగ్ కేంద్రాల ఏర్పాటు కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ జిల్లా యంత్రాంగం పూర్తి సంసిద్ధంగా ఉందని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా తెలియజేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో అదనపు కలెక్టర్ దేవ సహాయం, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.

# కులాంతర వివాహాలకు రాష్ట్ర ప్రభుత్వం అండ

## నాగర్ కర్నూల్ ఎంపి మల్లు రవి

**నాగర్‌కర్నూల్ జనవరి 12 (నిజాయితి) :**
రాష్ట్రంలో కుల వ్యవస్థ మూలంగా ఏర్పడిన సామాజిక విభేదాలను తొలగించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తున్నదని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు.కులాంతర వివాహం చేసుకున్న 5 జంటలకు సోమవారం ఐడీఓసీ కార్యాలయంలోని కలెక్టర్ ఛాంబర్ నందు ఎస్సీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రోత్సాహక బహుమతిని జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ లతో కలిసి నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి చెక్కులు అందజేశారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ...,రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలను పూర్తిగా వినియోగించుకోవాలని సూచించారు. సి అనిత రాము, వి లలిత నిమ్మల రాజకుమార్, కిరణ్ లాల్చంద్ కల్బుత్, మునగర శ్రీకాంత్ గువ్వల శ్రీదేవి,చంద్రశేఖర్,పి తిరుపతి లక్ష్మీ ప్రసన్న,పి శారద నాగరాజు జంటలకు కులాంతర వివాహాలను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఈ ఆర్థిక సంవత్సరంలో వివాహాల ప్రోత్సాహక పథకం కింద ఒక్కొక్క జంటకు రూ.2 లక్షల 50 వేల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు.ఎంపీ లబ్ధిదారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్, జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఉమాపతి తదితరులు పాల్గొన్నారు.



# నాగర్‌కర్నూల్ ఆర్థిక ప్రగతికి బ్యాంకర్ల భాగస్వామ్యం అవసరం - ఎంపి మల్లు రవి



**నాగర్‌కర్నూల్, జనవరి 12 (నిజాయితి) :** గత సంవత్సరం 5241 మందికి 502 కోట్ల రూపాయల రుణాల మంజూరు చేసిన బ్యాంకర్లను అభినందించిన ఎంపీ మల్లు రవి నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఆర్థిక ప్రగతితో పాటు ప్రజల సంక్షేమాన్ని సాధించాలంటే బ్యాంకర్ల భాగస్వామ్యం ఎంతో అవసరమని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. పేద ప్రజలు ఆర్థికంగా ఎదగాలంటే చిన్న పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందించాలని ఆయన సూచించారు. ఉపాధి అవకాశాల పెంపుతో పాటు స్వయం ఉపాధి దిశగా ప్రజలను ముందుకు నడిపించడంలో బ్యాంకులు కీలక పాత్ర పోషించాలన్నారు.సోమవారం సాయంత్రం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా స్థాయి బ్యాంకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అధ్యక్షత వహించగా, జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్ కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా విశ్వకర్మ యోజన, పీఎంఈజీపీ, ప్రాథమిక రంగాలు, ఎంఎస్ఎంఈ, గ్రామీణ బ్యాంకింగ్ సేవల అమలుపై సమగ్రంగా సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఎంపీ డాక్టర్ మల్లు రవి మాట్లాడుతూ.... నాగర్ కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం ఆర్థిక ప్రగతి, ప్రజల సంక్షేమానికి బ్యాంకర్ల భాగస్వామ్యం అత్యంత కీలకమని అన్నారు. పేద ప్రజలు ఆర్థికంగా ఎదగాలంటే చిన్న పరిశ్రమల స్థాపనకు బ్యాంకులు సహకరించాలని సూచించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతీ ఒక్కరికీ చేరేలా బ్యాంకర్లు చురుకైన పాత్ర పోషించాలన్నారు. ముఖ్యంగా స్వయం ఉపాధి, గ్రామీణ ఆర్థికాభివృద్ధికి రుణాల మంజూరులో వేగం పెంచాలని కోరారు.గత సంవత్సరం 5241 మంది లబ్ధిదారులకు 502 కోట్లు రూపాయల రుణాలు ఇవ్వడం పై బ్యాంకర్లను ఎంపీ మల్లు రవి అభినందించారు.పి ఎం ఈ జి పి ద్వారా జిల్లాలో 63 యూనిట్లలకు 184.06 కోట్ల రూపాయలు రుణాలు విడుదల చేశారని,ఇదేవిధంగా రానున్న సంవత్సరాలలో కూడా ప్రజలకు మరింత ఎక్కువ మొత్తంలో రుణాలు అందజేసిన బ్యాంకర్లు ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆయన ఈ సందర్భంగా సూచించారు.జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ....నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి చొరవతో ప్రజలకు అవగాహన కల్పించి బ్యాంకర్లు తో అనేక పర్యాయాలు సమావేశంలో నిర్వహించి అత్యధికంగా రుణాలు అందిన కృషి చేశారని ఈ సందర్భంగా కలెక్టర్ కొనియాడారు. ప్రభుత్వ పథకాల అమలులో బ్యాంకులు, అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్ మాట్లాడుతూ.... బ్యాంకింగ్ సేవల్లో భద్రత, ప్రజలకు అవగాహన కల్పనపై దృష్టి పెట్టాలన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మాట్లాడుతూ.... గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ప్రజల సంక్షేమానికి అనేక రకాల పథకాలను అమలు చేస్తుందని, రైతుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని బ్యాంకర్లు అధిక మొత్తంలో రుణాలు మంజూరు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ పి అమరేందర్ లీడ్ బ్యాంకు మేనేజర్ చంద్రశేఖర్, వివిధ బ్యాంకుల ప్రతినిధులు, బ్యాంకు మేనేజర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అందుల స్కూల్‌కి ఇరవై వేల చెక్కు అందజేత



**గద్వాల, జనవరి 12 (నిజాయితి) :** లూయిస్ బ్రైలీ జన్మదినం సందర్భంగా గద్వాల అంబేద్కర్ చౌక్ దగ్గర వున్న శివ బాలాజి హాస్పిటల్ డాక్టర్ వై హర్ష వర్ధన్ గౌడ్ మరియు డాక్టర్ హేమలత గారి తరపున అందుల బ్లైండ్ స్టిక్ కొరకు 20000 ఇరవై వేల రూపాయలు గద్వాల అందుల స్కూలుకి చెక్ అందచేయటం జరిగింది. ఈ కార్యక్రమానికి గద్వాల శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి రావటం మరియు డాక్టర్లునీ అభినందించడం జరిగింది.

# ప్రతినెల విధిగా సివిల్ రైట్స్ డే నిర్వహించాలి

## నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి




**నాగర్‌కర్నూల్, జనవరి 12 (నిజాయితి) :** సోమవారం సాయంత్రం నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ పిసిఆర్ 1955 & పిఓఎ ఆక్ట్,, 1989 అమలుపై సమీక్షా సమావేశంలో నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ చైర్మన్, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, నాగర్ కర్నూల్ జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, సమక్షంలో 2వ జిల్లా విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, మాట్లాడుతూ ... ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి వారి అవగాహన కోసం ప్రతి నెల 30, 31న సివిల్ రైట్స్ నిర్వహించి ఎస్సీ ఎస్టీలకు చట్టాలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో ఎంక్వైరీ వేగంగా పూర్తి చేసి ఛార్జ్ షీట్ వేస్తే, బాధితులకు న్యాయంతో పాటు ప్రభుత్వ నిబంధనల మేరకు పరిహారం వెంటనే అందజేసి, పేద ప్రజలకు సరైన అవగాహన కల్పించి ఎస్సీ ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అధికారులకు సూచించారు. అన్ని సంక్షేమ పథకాలలో ఎస్సీ ఎస్టీ లకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఎస్సీ ఎస్టీ యువతకు స్వయం ఉపాధి పథకాలను వినియోగించుకునేలా ప్రోత్సహించాలని, అందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి అవగాహన కల్పించాలని అధికారులు సూచించారు. ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలపై దాడులు జరిగిన వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేసి, పరిహారంగా బాధితులకు రూ.25వేలు చెల్లించేలా పకడ్బందీ చర్యలు తీసుకోవాలని సంబంధిత ఆధికారులను ఆదేశించారు. అలాగే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు బాధితులకు ప్రభుత్వ ఉత్తర్వులు, చట్టం ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు అయిన వెంటనే రూ.25వేల పరిహారం చెల్లించి, చార్జీషీటు దాఖలు అయ్యాక 50 శాతం, కేసు పూర్తి అయ్యాక మిగతా మొత్తం చెల్లించేలా చూడాలన్నారు.ఎస్సీ, ఎస్టీల కేసుల సత్వర పరిష్కారానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక దృష్టి, సారించాలని సూచించారు.నాగర్ కర్నూలు జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్,జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ మాట్లాడుతూ ఁఁ. నాగర్ కర్నూలు జిల్లా వ్యాప్తంగా ఇప్పటికి 251 ఎస్సీ, ఎస్టీ ఫిర్యాదులు అందగా అందులో 233 కేసులు అట్రాసిటీ కింద ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు వివరించారు. వాటిలో 176 కేసులకు చార్జీషీటు వేయడం దాఖలు అయ్యిందని, ఇప్పటివరకు 233 కేసులకు పరిహారం మంజూరు చేయడం జరిగిందని, 18 కేసులు పెండింగ్లో ఉన్నట్లు కలెక్టర్ తెలిపారు. మిగతా కేసులకు త్వరగా చార్జీషీటు వేసే విధంగా చూడాలని పోలీసుశాఖను సూచించారు. పోలీసు, రెవెన్యూ అధికారులు సమన్వయంతో పని చేసి బాధితులకు న్యాయం జరిగే లా చూడాలన్నారు. ఎస్సీ ఎస్టీ కేసులకు సంబంధించిన నష్టపరిహారం న్యాయపరమైన సమస్యలను వేగవంతంగా పరిష్కరించేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని కలెక్టర్ తెలిపారు. మిగతా కేసులకు త్వరగా చార్జీషీటు వేసే విధంగా చూడాలని పోలీసుశాఖను సూచించారు. అదేవిధంగా రెవెన్యూ, పోలీసుశాఖ సిబ్బంది గ్రామాల్లో సివిల్ రైట్స్ దినం నిర్వహించి ఎస్సీ, ఎస్టీ హక్కులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. అందుకు సంబంధించి నివేదికను జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖకు అందచేయాలని సూచించారు. ప్రతి విభాగం తన పనితీరు నివేదికను సమర్పించగా, కమిటీ సభ్యులు వాటిపై ప్రశ్నలు అడిగి, అవసరమైన సూచనలు, అందించారు.ఎస్సీ, ఎస్టీ కమిటీ సభ్యులు, మాట్లాడుతూ ఁఁ పారదర్శకత, బాధ్యతాయుత సమర్పణ, ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అన్ని శాఖలు మరింతగా సమన్వయం చేసుకోవాలని కమిటీ సూచించింది. సమావేశంలో పాల్గొన్న ప్రతి సభ్యుడు తమ సలహాలు, అభిప్రాయాలను వ్యక్తం చేశారు.ప్రతి కేసు వారిగా కులంకశంగా చర్చించారు.జిల్లా కేంద్రంలో అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు వినతిపత్రాన్ని సమర్పించారు. అందుకు సానుకూలంగా స్పందించారు.అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ....భూ సమస్యల వల్లనే ఎక్కువగా తగాదాలు జరుగుతున్నాయని, వాటి పరిష్కారానికి అధికారులు ప్రత్యేకంగా కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ అమరేందర్, డి.ఎస్.పిలు బుర్రి శ్రీనివాసులు, శ్రీనివాస్, ఎస్సీ, ఎస్టీ కులాల నుండి ప్రాతినిధ్యం సభ్యులు, ఎల్లపోగు వెంకటస్వామి, చిననగల్లా పరశురాం, గుమ్మకొండ రాములు, వెల్టూరి రెణయ్య, కె. చందర్, రెద్యా, ఆర్డీవోలు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి,మెంబర్ సెక్రెటరీ ఉమాపతి, అధికారిక కమిటీ సభ్యులు పిడి డిఆర్డిఏ చిన్న ఓబులేసు , జిల్లా లేబర్ అధికారి రాజ్ కుమార్, జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ఫిరంగి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యాభివృద్ధే యువత భవిష్యత్తుకు పునాది :

## ఎమ్మెల్యే శ్రీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్, జనవరి 12 (నిజాయితి) :**
నైపుణ్యాభివృద్ధి ద్వారా మాత్రమే యువతకు స్థిరమైన ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలు లభిస్తాయని గౌరవ మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ నగరంలోని వన్ టౌన్ ప్రాంతంలో జన శిక్షణ సంస్థాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రీన్ గ్రూప్స్ కంప్యూటర్ అకాడమీని ఆయన ముఖ్య అతిథిగా హాజరై ఘనంగా ప్రారంభించారు.అనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ, జన శిక్షణ సంస్థాన్ ద్వారా మహబూబ్‌నగర్ నగరంలోని పేద, మధ్యతరగతి యువతకు ఉపయోగపడే అనేక వృత్తి నైపుణ్య కోర్సులు అందుబాటులోకి రావడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా నిరుద్యోగ యువత, మహిళలు ఈ శిక్షణా కేంద్రాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కేంద్రంలో కంప్యూటర్ శిక్షణ, అసిస్టెంట్ కంప్యూటర్ ఆపరేటర్ , బ్యూటీ కేర్, డ్రెస్ మేకర్, కృత్రిమ ఆభరణాల తయారీ, ఎలక్ట్రీషియన్‌లో డిప్లొమా,ప్లంబర్‌లో డిప్లొమా ,టైలరింగ్ , ఎంబ్రాయిడరీ మొబైల్ రిపేరింగ్ వంటి కోర్సులతో పాటు ఉపాధ్యాయ శిక్షణ కోర్సులు కూడా అందించడం వల్ల స్వయం ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉంటాయని తెలిపారు. శిక్షణ పూర్తిచేసుకున్న వారు ఉద్యోగాలు పొందడమే కాకుండా, స్వంత వ్యాపారాలు ప్రారంభించి ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగవచ్చని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం యువత కోసం తీసుకొస్తున్న నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న ఇలాంటి సంస్థలకు పూర్తి సహకారం అందిస్తామని ఎమ్మెల్యే భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, సాదుల్లా , అబ్దుల్ రషీద్ , మథీన్, సంస్థ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు సిద్ధంగా ఉండాలి.

## అదనపు కలెక్టర్ (రెవిన్యూ) లక్ష్మీనారాయణ

**గద్వాల, జనవరి 12 (నిజాయితి) :** మున్సిపల్ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల అధికారులు సిద్ధంగా ఉండాలని అదనపు కలెక్టర్ (రెవిన్యూ) లక్ష్మీనారాయణ అన్నారు.మున్సిపల్ ఎన్నికలు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణం పై సోమవారం రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, ఇతర ఉన్నతాధికారులు హైదరాబాద్ నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్లు, ఇతర అధికారులు వీసీలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ మున్సిపల్ ఎన్నికల ఎలక్ట్రోరల్ వార్డుల వారీగా ఫైనల్ పబ్లికేషన్ ప్రకటించిన నేపథ్యంలో మిగిలిన ప్రక్రియ నిర్దేశిత సమయంలోగా పూర్తి చేయాలన్నారు. ఎన్నికలను పారదర్శకంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు ఆయా జిల్లాల ఎన్నికల యంత్రాంగం సమిష్టిగా పని చేయాలని ఆదేశించారు. యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలలను ప్రస్తుతం 79 నియోజకవర్గాల్లో ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోందని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యార్థులకు ఒకే చోట నాణ్యమైన విద్యను అందించాలనే సంకల్పంతో ఈ పాఠశాలలను ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. విద్యార్థులకు చదువుతోపాటు వ్యక్తిత్వ వికాస నిర్మాణం, పోటీ పరీక్షలకు సన్నద్ధం చేసేలా, సైన్స్ ఫెయిర్స్ లో ప్రతిభ చాటేలా, క్రీడా, తదితర రంగాల్లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలోనే ఈ పాఠశాలలను ప్రారంభించేలా భవనాల నిర్మాణం వేగవంతం చేయాలన్నారు. ఆయా జిల్లాల కలెక్టర్లు ఈ పాఠశాలల నిర్మాణంపై ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తూ నిర్ణీత సమయంలోగా పూర్తి అయ్యేలా సంబంధిత శాఖల అధికారులకు దిశా నిర్దేశం చేస్తూ ఉండాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలో కేటి దొడ్డి మండల కేంద్రంలో యంగ్ ఇండియా సమీకృత రెసిడెన్షియల్ పాఠశాల నిర్మాణానికి ఇప్పటికే టెండర్ పూర్తయిందని పేర్కొన్నారు. మున్సిపల్ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించామన్నారు. జిల్లాలోని నాలుగు మున్సిపాలిటీలలో వార్డుల వారీగా ఫైనల్ ఎలక్ట్రోరల్ జాబితా పబ్లికేషన్ పూర్తిచేసి, ఎన్నికల ప్రక్రియకు అవసరమైన ఏర్పాట్లన్నీ చేస్తున్నట్లు తెలిపారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) నర్సింగరావు, టీజీ ఈడబ్ల్యూఐడీసీ డిఈఈ వెంకట్ రెడ్డి, ఏఈ మోహన్ రెడ్డి, ఆయా మున్సిపాలిటీల కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో జోరుగా ల్యాండ్ పూలింగ్ కర్లపూడిలో ప్రారంభం



**అమరావతి/పల్నాడు జిల్లా, జనవరి 12:** రాష్ట్ర రాజధాని అమరావతి ప్రాంతంలో రెండో దశ ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ వేగవంతంగా సాగుతోంది. (సోమవారం) పెదకూరపాడు మండలం కర్లపూడి - లేమల్లెలో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియను మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, పట్టణాభివృద్ధి మంత్రి నారాయణ( ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే భాష్యం కలిసి రైతుల నుంచి అంగీకార పత్రాలను మంత్రి స్వీకరించారు. కాంపిటెంట్ అథరిటీ.. గ్రామంలో 2654 ఎకరాలకు ల్యాండ్ పూలింగ్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ క్రమంలో ల్యాండ్ పూలింగ్ కోసం గ్రామానికి వచ్చిన మంత్రి నారాయణ, ఎమ్మెల్యే ప్రవీణ్‌కు రైతులు ఘన స్వాగతం పలికారు. తమ గ్రామాన్ని ల్యాండ్ పూలింగ్‌కు ఎంపిక చేసినందుకు సీఎం చంద్రబాబు మంత్రి నారాయణకు అన్నదాతలు ధన్యవాదాలు తెలిపారు.కాగా.. అమరావతి రాజధాని ప్రాంతంలో మొత్తం 7 గ్రామాల్లో సుమారు 16,666 ఎకరాలు భూసమీకరణ చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. ఇందులో పల్నాడు జిల్లా పెదకూరపాడు నియోజకవర్గంలోని అమరావతి మండలంలో వైకుంఠపురం, పెదమద్దూరు, ఎండ్రాయి, కర్లపూడి, లేమల్లె గ్రామాలు ఉండగా.. మిగిలిన 3 గ్రామాలు(వడ్డమాను, హరిశ్చంద్రపురం, పెదపరిమి) గుంటూరు జిల్లా తుళ్లూరు మండలంలో ఉన్నాయి. ఇప్పటివరకు మొత్తం 7 గ్రామాలకు గానూ 4 గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. అంతర్జాతీయ విమానాశ్రయం, క్రీడా నగరం, స్మార్ట్ పరిశ్రమలు, రైల్వే ట్రాక్, ఇన్నర్ రింగ్‌రోడ్డు కోసం ప్రభుత్వం ఈ భూములను సేకరిస్తోంది.

# అన్నీ తాడేపల్లి ప్యాలెస్‌తోనే లింక్ త్వరలో శిక్ష తప్పదు



**విజయవాడ, జనవరి 12:** వైసీపీ నాయకులపై టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డితీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. వైసీపీ నాయకులు రాజకీయ నిరుద్యోగులుగా మిగిలారని ఎద్దేవా చేశారు. 2019 నుంచి 2024 వరకు వైసీపీ ప్రభుత్వం అధికారంలో ఉండగా.. ప్రజల ఆగ్రహంతో పాటు వేంకటేశ్వర స్వామి ఆగ్రహం కూడా వారిపై పడిందన్నారు. ధార్మిక క్షేత్రాన్ని ధనార్జన క్షేత్రంగా మార్చేశారని, టార్గెట్ తిరుమలతో వైసీపీ నాయకులు పనిచేస్తున్నారని విమర్శించారు. రాజకీయంగా ఎదుర్కొనే దమ్ము, ధైర్యం లేని వైసీపీ ఆధారాలు లేకుండా అసత్య ప్రచారం చేస్తోందని ధ్వజమెత్తారు. గోశాల నుంచి గోవిందుడి వరకు వైసీపీ నాయకులు ఆధారాలు సృష్టించి తమపై అపచారం మోపుతున్నారని భానుప్రకాశ్ రెడ్డి ఆరోపించారు.థెఫ్ట్‌ను గిఫ్ట్‌గా చేసిన వైసీపీ.పరకామణి విషయంలో చెట్టుకింద పంచాయతీ చేశారని, జగన్‌కు ఆలయ ప్రతిష్ఠ గురించి తెలుసా అని ప్రశ్నించారు భానుప్రకాశ్. హిందువుల మనోభావాలు అంటే అంత దిగజారుడు ఆలోచనలా అని మండిపడ్డారు. గతంలో వేంకటేశ్వర స్వామితో పెట్టుకున్న వారు మాడి మసయ్యారని, దేశ ద్రోహం ఎంత తప్పో స్వామి ద్రోహం కూడా అంతే తప్పుని ఆయన వ్యాఖ్యానించారు. చట్టంలోని లొసుగులతో వైసీపీ నాయకులు విర్రవీగుతున్నారని భానుప్రకాశ్ విమర్శించారు. మద్యం బాటిళ్లు తీసుకెళ్లి టీటీడీ మీద, ధర్మకర్తల మీద నెట్టడం ఎంతవరకు సమంజసమని భూమన కరుణాకర్ రెడ్డిని ప్రశ్నించారాయన. ఆధారాలతో సహా చట్టపరిధిలో శిక్షిస్తామని హెచ్చరించారు. పంచభూతాలు కూడా వైసీపీ నాయకుల కదలికలను గమనిస్తున్నాయని, పరకామణిలో చోరీ కేసులో దొంగను దాతగా చేసింది వైసీపీ అని విమర్శించారు. వైసీపీ.. థెఫ్ట్‌ను గిఫ్ట్‌గా చేసిందంటూ ఆయన కామెంట్స్ చేశారు.ప్రజలు తన్ని తరిమేయడం ఖాయం.విధాన విషయాలపై చర్చకు రావాలని.. అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పేందుకు తాము సిద్ధమని భానుప్రకాశ్ రెడ్డి సవాల్ విసిరారు. టీటీడీలో జరిగే ప్రతి అంశం తాడేపల్లి ప్యాలెస్‌తో లింక్ అయిఉందని.. రాబోయే రోజుల్లో పాత్రధారులు, సూత్రధారులు, లబ్ధిదారులు అందరికీ శిక్ష తప్పదని హెచ్చరించారు. ధార్మిక క్షేత్రంలో గతంలో దాపరికాలు ఉండేవని, తాము ప్రతిదీ వెబ్‌సైట్‌లో ఉంచుతున్నామని ఆయన తెలిపారు. 'మీరు(వైసీపీ) నిప్పు ఉప్పు అంటే ఎందుకు దాపరికం' అని ప్రశ్నించారు. అలాగే మున్ముందు వైసీపీ ఇలానే వ్యవహరిస్తే ప్రజలు వారిని తన్ని తరిమేస్తారని బీజేపీ హెచ్చరిస్తోందని అన్నారు. రాబోయే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని టీటీడీ బోర్డు సభ్యుడు భానుప్రకాశ్ రెడ్డి హెచ్చరించారు.

# పీఎస్ఎల్‌వీ-సీ62 ప్రయోగంలో అంతరాయం : ఇస్రో చైర్మన్



**శ్రీహరి కోట :** భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చేపట్టిన పీఎస్ఎల్‌వీ-సీ62 రాకెట్ ప్రయోగంలో అంతరాయం ఏర్పడింది. ఈ విషయాన్ని ఇస్రో చైర్మన్ వి. నారాయణన్ వెల్లడించారు. ప్రయోగం మూడో దశ వరకు సాఫీగానే సాగినట్లు చెప్పారు. ఆ తర్వాత కొంత అంతరాయం ఏర్పడిందని తెలిపారు. మూడో దశ చివర్లో శాటిలైట్‌తో సంబంధాలు తెగిపోయినట్లు చెప్పారు. సమస్యకు గల కారణాలను విశ్లేషిస్తున్నట్లు ఇస్రో చైర్మన్ పేర్కొన్నారు. ఈ ఏడాది ఇస్రో చేపట్టిన తొలి ప్రయోగం ఇది.శ్రీహరి కోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ (షార్) నుంచి పీఎస్ఎల్‌వీ సీ-62 (గూూూం జ-62) రాకెట్‌ను ఉదయం ప్రయోగించారు. ఈ రాకెట్ ద్వారా 14 ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపింది. ఈ ఉపగ్రహం బరువు 1,485 కేజీలు. దీనికి అన్వేష గా నామకరణం చేశారు. ఈ ప్రయోగం ద్వారా భూ పరిశీలన శాటిలైట్‌లో అత్యంత అధునాతమైనది 'ఈవోఎస్-ఎన్1' (అన్వేష) ను రోదసిలోకి పంపుతున్నారు. న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ రూపొందించిన తొమ్మిదో పూర్తిస్థాం ఖ వాణిజ్య ఉపగ్రహమిది.దేశ రక్షణ రంగానికి ఇది అత్యంత కీలకమని, ఇది 2026లో ఇస్రో చేపడుతున్న తొలి ప్రయోగమని ఇస్రో చైర్మన్ డాక్టర్ వి నారాయణన్ ఇప్పటికే తెలిపారు. రోదసి నుంచి భారత్ నిఘా సామర్థ్యాల్ని పెంచేదిగా, భూమిపై ఓ కన్నేసి ఉంచటంగా 'అన్వేష'ను సైంటి స్టులు పేర్కొన్నారు. దీంతోపాటు స్పానిష్ స్టార్టప్ తయారుచేసిన చిన్నపాటి 'క్యాప్సుల్'ను, మరో 17 దేశవిదేశాలకు చెందిన శాటిలైట్స్‌ను ఇస్రో ఈ మిషన్ ద్వారా నింగిలోకి పంపింది. దేశరక్షణ రంగంలో అత్యంత కీలకమైన ఈ ప్రయోగం విఫలమవడంతో ఇస్రో శాస్త్రవేత్తల్లో తీవ్ర నిరాశ వ్యక్తమవుతోంది.

# ఎన్‌హెచ్‌ఏఐకి 4 గిన్నిస్ రికార్డులు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారన్న కేంద్రమంత్రి



**విజయవాడ :** నేషనల్ హైవేస్ అథరిటీస్ ఆఫ్ ఇండియా, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ అత్యంత అరుదైన ఘనతను సాధించాయి. బెంగళూరు - విజయవాడ హైవే నిర్మాణంలో 4 గిన్నిస్ రికార్డులు నెలకొల్పాయి. ఎన్‌హెచ్ఏఐ, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ ఆధ్వర్యంలో 6 రోజుల్లోనే 156 కిలోమీటర్ల రహదారి నిర్మాణం జరిగింది. జనవరి 6న 24 గంటల్లోనే 28.8 కిలోమీటర్ల రహదారి నిర్మాణం జరిగింది. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు.. నేషనల్ హైవేస్ అథరిటీస్ ఆఫ్ ఇండియా, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్‌లపై ప్రశంసలు కురిపించారు.ఎన్‌హెచ్ఏఐ, రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సాధించిన రికార్డులపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ మాట్లాడుతూ.. 'మన ఇంజినీర్లు, అధికారులు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు. విజయం సాధించడంలో కృషిచేసిన ప్రతి ఒక్కరికీ అభినందనలు. నూతన సాంకేతికతతో నాణ్యమైన రహదారుల నిర్మాణం జరగడం గొప్ప విషయం. తక్కువ సమయంలో వేగంగా రహదారుల నిర్మాణం పూర్తిచేశారు. నాణ్యత విషయంలో రాజీలేకుండా రోడ్ల నిర్మాణం జరుగుతోంది' అని అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 'బెంగుళూరు - విజయవాడ ఎకనామిక్ కారిడార్‌లో నాలుగు గిన్నిస్ రికార్డులు సాధించటంపై అందరినీ అభినందిస్తున్నాను. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ పనిచేసే వేగం, సామర్థ్యం దేశంలో అందరికీ పరిచయమే. రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ సంస్థను కూడా ప్రత్యేకంగా అభినందిస్తున్నా. నితిన్ గడ్కరీ నాయకత్వంలో ప్రపంచ స్థాయిలో ఈ రికార్డును సాధించటం గర్వకారణం. 10,655 మెట్రిక్ టన్నుల బిటుమిన్ కాంక్రీట్ నిరంతరాయంగా వేస్తూ మరో ప్రపంచ రికార్డు సాధించారు' అని అన్నారు.

# కాశీబుగ్గ వేంకటేశ్వర స్వామి ఆలయంలో చోరీ 60 లక్షల విలువైన నగలు అపహరణ



**శ్రీకాకుళం జిల్లా :** కాశీబుగ్గలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో భారీ చోరీ జరిగింది. గుడిలోని బంగారం, వెండి ఆభరణాలను దోచుకెళ్లారు. దేవాలయం వెనుక ద్వారం నుంచి వచ్చిన దుండగులు ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లుగా సోమవారం ఆలయ సిబ్బంది గుర్తించారు. ఈ మేరకు కాశీబుగ్గ పోలీసులకు ఆలయ ధర్మకర్త ముకుంద పండా సమాచారం అందించారు.దొంగతనానికి గురైన ఆభరణాల విలువ దాదాపు రూ.60 లక్షల విలువైనవి అని ఆలయ అధికారులు చెబుతున్నారు. కాగా, ఆలయంలో చోరీపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనాస్థలిని పరిశీలించారు. కాగా, కాశీబుగ్గలో గత ఏడాది నవంబర్ 1వ తేదీన ఏకాదశి పర్వదినాన భక్తులు భారీగా తరలిరావడంతో తొక్కిసలాట జరిగి 9 మంది భక్తులు మృతి చెందిన సంగతి తెలిసిందే.

# పామర్రులో వీరంగం ఇద్దరు జర్నలిస్టులు అరెస్ట్



**కృష్ణా జిల్లా, జనవరి12 :** కృష్ణా జిల్లాలోని పామర్రులో ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు వీరంగం సృష్టించిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. మద్యం మత్తులో సామాన్యులపై దాడి చేయడమే కాకుండా.. విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై దౌర్జన్యం చేశారు. ఈ క్రమంలో వీరిని అరెస్ట్ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పామర్రు పోలీసులు వెల్లడించారు.ఏం జరిగిందంటే.పామర్రులోని చల్లపల్లి రోడ్డులో ఉన్న ఒక మద్యం దుకాణం వద్ద ఆదివారం రాత్రి సాక్షి మీడియా, సీవీఆర్ ఛానళ్లకు సంబంధించిన రిపోర్టర్లు, మరికొందరు యువకులతో కలిసి తీవ్రస్థాయిలో హల్‌చల్ చేశారు. మద్యం దుకాణం వద్దకు చేరుకున్న పాత్రికేయులు కిట్టు, సందీప్ సహా మరో ఇద్దరు యువకులు అక్కడి వారితో వాగ్వాదానికి దిగారు. అసభ్య పదజాలంతో దూషిస్తూ దుకాణంపైకి రాళ్లు విసిరారు. జనసేన ఇన్‌ఛార్జ్ డ్రైవర్‌పై దాడి.ఈ ఘటన జరుగుతుండగా అక్కడే ఉన్న జనసేన పామర్రు ఇన్‌ఛార్జ్ తాడిశెట్టి నరేశ్ వారిని ప్రశ్నించారు. ఆగ్రహానికి గురైన జర్నలిస్టులు ఆయన డ్రైవర్ శ్రీకాంత్‌పై రాళ్లు, కర్రలతో దాడి చేశారు. ఈ దాడిలో శ్రీకాంత్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘర్షణ సమయంలో సదరు విలేకరులు.. 'టీడీపీ వాళ్లను చంపేస్తాం' అంటూ కేకలు వేస్తూ భయాందోళనలు సృష్టించినట్లు సమాచారం. దాడిలో తీవ్రంగా గాయపడిన శ్రీకాంత్‌కు ప్రస్తుతం ఆస్పత్రిలో వైద్యం అందిస్తున్నారు. ఈ ఘటనపై శ్రీకాంత్ కుటుంబ సభ్యులు కూడా పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది.పోలీసులపై దౌర్జన్యం.ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు గొడవను ఆపడానికి ప్రయత్నించారు. అయితే.. పోలీసులపైనా అమర్యాదగా ప్రవర్తించి, వారి విధి నిర్వహణకు ఆటంకం కలిగించారా పాత్రికేయులు. ఈ ఘటనతో పామర్రులో హైటెన్షన్ వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించి పరిస్థితిని సమీక్షిస్తున్నారు. ఎలాంటి ఘర్షణలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకున్నారు.కేసు నమోదు, అరెస్ట్.బాధితుడు శ్రీకాంత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పామర్రు పోలీసులు నిందితులపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. జర్నలిస్టులు కిట్టు, సందీప్‌లపై బీఎన్ఎస్ సెక్షన్లు - 353, 324 కింద కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ గొడవలో పాల్గొన్న మిగిలిన ఇద్దరు యువకులు విజయవాడకు చెందిన గంజాయి బ్యాచ్‌అబక్రీక్రీకు చెందిన వారని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలింది.

# సైబర్ ముఠాకు చిక్కిన 22 మంది ఏపీ యువత సేఫ్




**అమరావతి, జనవరి 12:** ఉద్యోగాల కోసం విదేశాలకు వెళ్లి సైబర్ మోసాల ముఠాకు చిక్కుకున్న ఏపీకి చెందిన 22మందిని సీఐడీ పోలీసులు రక్షించారు. దీనిపై సీఐడీ ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా మీడియాతో మాట్లాడుతూ... సైబర్ శ్లావరీ స్లేవరీలో భాగంగా ఈస్ట్ ఆసియా దేశాలలో చిక్కుకున్న భారతీయులకు విముక్తి కలిగించామన్నారు. ఫ్రీ జాబ్ ఆఫర్స్ కోసం విదేశాలకు వెళ్లి సైబర్ క్రైమ్ కూపంలో ఇరుక్కుంటున్నారని.. బ్యాంకాక్, మయన్మార్, కంబోడియా వంటి దేశాలలో జాబ్ కోసం వెళ్లిన భారతదేశ యువకులు ఈ సైబర్ ముఠా ట్రాప్‌అబక్రీక్రీలో పడుతున్నారని తెలిపారు. కాల్ సెంటర్ల ద్వారా యువతను ఆకట్టుకునేలా మాటలు చెబుతున్నారని.. ఫ్లైట్ టిక్కెట్లు కూడా ఏర్పాటు చేసి, మంచి ఉద్యోగం ఇస్తామని నమ్మబలుకుతారని సీఐడీ ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా వెల్లడించారు.బెదిరించి. భయపెట్టి మరీ.ఆయా దేశాల్లో 15 గంటల ప్రయాణం తర్వాత అటవీ ప్రాంతంలో ఉంచి.. సైబర్ క్రైమ్ లో భాగస్వామ్యులుగా చేస్తున్నారని అదిరాజ్ సింగ్ రాణా తెలిపారు. యువకుల పాస్‌పోర్టు, ఫోన్లు లాగేసుకుని.. అనేక విధాలుగా సైబర్ క్రైమ్‌లు చేయిస్తున్నారని చెప్పారు. ఫోన్లు చేసి హనీ ట్రాప్‌లు చేసేలా వీరిని బలవంతంగా ఒప్పించి పని చేయిస్తారన్నారు. మాట వినకుంటే.. తిండి పెట్టకుండా.. ఇబ్బందులు పెడతారని.. బెదిరించి, చెప్పినట్లు మోసం చేస్తేనే వారికి తిండి పెడతారని ఆయన తెలిపారు. ఎవరైనా వెళ్లిపోతామంటే.. రూ.10లక్షలు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారన్నారు. దీంతో ఏ దారి లేక చాలా మంది భారతీయ యువత ఈ తరహాలో మోసపోయి.. సైబర్ క్రైమ్ లకు పాల్పడుతున్నారని సీఐడీ ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా పేర్కొన్నారు.1,586 మంది వెనక్కి..భారతదేశ ప్రభుత్వం ఈ తరహా మోసాలను గుర్తించి వారిని తీసుకు వచ్చేలా ఏర్పాట్లు చేసిందని సీఐడీ ఎస్పీ తెలిపారు. ఈ విధంగా తాజాగా 22మంది ఏపీకి చెందిన వారిని క్షేమంగా తీసుకురాగా, వారిని సీఐడీ విచారించిందని తెలిపారు. దేశవ్యాప్తంగా 1,586మంది ఇలా సైబర్ మోసాల బారిన పడిన వారిని మూడు నెలల్లో వెనక్కి తీసుకువచ్చారన్నారు. వీరిలో ఏపీకి చెందిన వారు 120 మంది ఉన్నారని తెలిపారు. వీరిలో పురుషులతోపాటు మహిళలు, యువత కూడా చాలా మంది ఉన్నారన్నారు. అక్కడ ఎలా మోసం జరుగుతుంది.. ఆకర్షితమైన ప్రకటనలు ఎలా ఉంటాయో వారు తెలిపారని చెప్పారు. భారతీయ రీజనల్ లాంగ్వేజ్ బాగా మాట్లాడే వారిని గుర్తించి మరీ ఈ మోసాల్లోకి దింపుతున్నారని చెప్పారని సీఐడీ ఎస్పీ తెలిపారు.

# ఏపీలో 14 మంది ఐఏఎస్ అధికారుల బదిలీలు




**అమరావతి :** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్రంలో 14 మది ఐఏఎస్ అధికారులను బదిలీలు చేస్తూ పోస్టింగ్ ఉత్తర్వులు జారీ చేసింది. ఇటీవల నూతనం ఏర్పడ్డ మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా పి.శ్రీనివాసులు , ప్రకాశం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా కల్పన కుమారి , తిరుపతి జేసీగా, తుడా వైస్ చైర్మన్‌గా ఆర్.గోవిందరావుకుపోస్టింగ్ కల్పించింది.కడప జాయింట్ కలెక్టర్‌గా నిధి మీనా, అనంతపురం జాయింట్ కలెక్టర్‌గా సి. విష్ణుచరణ్, అనకాపల్లి జాయింట్ కలెక్టర్‌గా మల్లవరపు సూర్యతేజ, చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఆదర్శ్ రాజేంద్రన్ పోస్టింగ్ కల్పించింది. అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శివ్ నారాయణ్ శర్మ, పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా వి. సంజనా సింహ, విశాఖ జాయింట్ కలెక్టర్‌గా గొబ్బిళ్ల విద్యాధరి పోస్టింగ్ ఇస్తూ ప్రభుత్వం బదిలీ చేసింది.వైద్య ఆరోగ్య శాఖ జాయింట్ సెక్రటరీగా రోణంకి గోపాలకృష్ణ, పౌర సరఫరాల శాఖ డైరెక్టర్‌గా శ్రీవాస్ నుపుర్ అజయ్‌కుమార్, గుంటూరు మున్సిపల్ కమిషనర్‌గా కతవాటె మయూర్ అశోక్‌ను, గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ ఎండీగా ఎస్.ఎస్.శోబికను బదిలీ చేస్తు ఉత్తర్వులు జారీ చేసింది.

# పోలవరం నల్లమల్ల సాగర్ లింకుపై కీలక నిర్ణయం



**పోలవరం :** ఆంధ్రప్రదేశ్ ప్రతిపాదించిన పోలవరం--నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై తెలంగాణ ప్రభుత్వం సవాలు చేసిన నేపథ్యంలో రెండు రాష్ట్రాల మధ్య నీటి వివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. తెలంగాణ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును నిలిపివేయాలంటూ సుప్రీం కోర్టులో పిటిషన్ వేసింది. ఈ కేసు విచారణ జనవరి 12న జరగనుండటంతో, ఏపీ ప్రభుత్వం చట్టపరంగా పోరాడేందుకు సిద్ధమైంది.జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు న్యాయ బృందం మరియు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి కేసుకై అవసరమైన పత్రాలు, సమాచారాన్ని వెంటనే న్యాయవాదులకు అందించాలని ఆదేశించారు. ఏపీ తరఫున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించనున్నారు. ఏపీ వాదన ప్రకారం గోదావరి నదిలో ఏటా సుమారు 3000 టీఎంసీల నీరు సముద్రంలో వృథ అవుతోంది. అందులో కేవలం 200 టీఎంసీల వరద నీటినే రాయలసీమ ప్రాంతాలకు తరలించాలని లక్ష్యం.నిమ్మల రామానాయుడు పేర్కొన్నదేమిటంటే, దిగువ రాష్ట్రంగా మిగులు జలాలను వినియోగించే హక్కు గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్ అవార్డు ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు ఉందని. కేంద్ర ప్రభుత్వ సూచనలు మేరకు ప్రాజెక్టు ఖూ= ని సిద్ధం చేస్తుండగా, అన్ని అనుమతులు వచ్చిన తరువాతే పనులు ప్రారంభిస్తామని ఆయన స్పష్టం చేశారు. సముద్రంలో కలిసిపోతున్న నీటిని కరవు గ్రస్త ప్రాంతాల అభివృద్ధికి వాడడంలో తప్పేముందంటూ ఏపీ ప్రశ్నిస్తోంది.ఇక తెలంగాణ మాత్రం పూర్తిగా విభిన్నంగా స్పందిస్తోంది. ఈ ప్రాజెక్టు గోదావరి జల వివాదాల ట్రిబ్యునల్--1980 అవార్డు ఉల్లంఘన అని, అంతర్రాష్ట్ర జల నిబంధనలకు వ్యతిరేకమని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఏపీ ప్రతిపాదించిన లింక్ ప్రాజెక్టును ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోమని ఆయన తేల్చిచెప్పారు.ఈ నేపథ్యంలో పోలవరం--నల్లమల సాగర్ వివాదం రెండు రాష్ట్రాల మధ్య నీటి హక్కుల పట్ల కొత్త ఉద్రిక్తతను సృష్టించింది. ఏపీ ప్రతి పాయింట్‌ను న్యాయపరంగా సమర్థించుకునేందుకు సిద్ధమవుతుండగా, తెలంగాణ మాత్రం ప్రాజెక్టును అడ్డుకోవడానికి కఠినంగా పోరాడుతోంది. సుప్రీంకోర్టు తీర్పు రెండు రాష్ట్రాల నీటి కేటాయింపులపై విస్తృత ప్రభావాన్ని చూపే అవకాశం ఉంది.

TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితీ
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక

# పోలవరం నల్లమల సాగర్ లింక్‌పై సుప్రీంకోర్టులో కీలక విచారణ

**ఢిల్లీ, జనవరి12 :** పోలవరం – నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరుగుతోంది. ఈ విచారణకు తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిహాజరయ్యారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా సుప్రీంలో తెలంగాణ సర్కార్ రిట్ పిటీషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే ఆర్టికల్ 131 కింద సివిల్ సూట్ దాఖలు చేసుకోవాలని సీజేఐ ధర్మాసనం సూచించింది. మధ్యవర్తిత్వం ద్వారా జల వివాదాలను పరిష్కరించుకోవాలని కూడా మార్గనిర్దేశం చేసింది. కేంద్ర ప్రభుత్వం నియమించిన ఉన్నతస్థాయి కమిటీ వద్ద తెలంగాణ వాదనలు వినిపించుకోవచ్చునీ అభిప్రాయపడింది.ఎలాంటి అనుమతులు లేవు.అయితే.. తెలంగాణ ప్రభుత్వంతో మాట్లాడి మళ్లీ తమ వాదనలు వినిపిసానని గత విచారణ సందర్భంగా సీనియర్ కౌన్సిల్ అభిషేక్ మను సింఘ్వీ తెలిపారు. నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేనందున ప్రాజెక్టు పనులు ఆపాలని తెలంగాణ సర్కార్‌కు తెలిపింది. ఈ నేపథ్యంలో తెలంగాణ ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. రాష్ట్రం తరఫున సీనియర్ న్యాయవాది అబిషేక్ మను సింఘ్వీ మరోసారి వాదనలు వినిపిస్తున్నారు.గోదావరిపై ఏపీ ప్రాజెక్టు.పోలవరం ప్రాజెక్టు నుంచి బనకచర్ల హెడ్ రెగ్యులేటర్ లేదా నల్లమల సాగర్ జలాశయానికి లింక్ చేసేలా గోదావరిపై ఏపీ ప్రాజెక్టు



నిర్మిస్తోందంటూ రిట్ పిటిషన్‌లో తెలంగాణ పేర్కొంది. ఈ ప్రాజెక్టుకు ఎలాంటి అనుమతులు లేవని, ఆ పనులను తక్షణమే నిలిపివేసేలా పోలవరం ప్రాజెక్టు అథరిటీని ఆదేశించాలని అభ్యర్థించింది. కేంద్ర ప్రభుత్వం అనుమతించిన మేరకే పోలవరం ప్రాజెక్టు స్వరూపం ఉండాలని, విస్తరణ పనులు చేపట్టడం చట్టవిరుద్ధమని పిటీషన్‌లో పేర్కొంది. తమ అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోకుండా నల్లమల సాగర్ ప్రాజెక్టు ప్రీ ఫీజిబిలిటీ రిపోర్టును కేంద్ర ప్రభుత్వం పరిశీలించడం సమంజసం కాదని చెప్పింది. ఈ ప్రాజెక్టుపై తదుపరి చర్యలు చేపట్టరాదంటూ జలశక్తి మంత్రిత్వ శాఖ, కేంద్ర జలసంఘం, గోదావరి నదీ యాజమాన్య బోర్డులకు స్పష్టమైన ఆదేశాలు ఇవ్వాలని రిట్ పిటిషన్‌లో పేర్కొంది తెలంగాణ. అయితే.. వరద జలాలను మాత్రమే తాము వాడు కుంటున్నామని ఆంధ్రప్రదేశ్ బదులిచ్చింది. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా. బచావత్ ట్రిబ్యునల్ తీర్పునకు విరుద్ధంగా పోలవరం నుంచి గోదావరి జలాలు తరలించేం దుకు ఉద్దేశించిన ప్రాజెక్టును నిలిపివేయాలని తెలంగాణా సర్కార్ పిటిషన్‌లో ప్రస్తావించింది. గోదావరిపై నిర్మిస్తున్న పోలవరం ప్రాజెక్టు నుంచి 200 టీఎంసీల నీటిని బొల్లాపల్లి రిజర్వాయర్ ద్వారా నల్లమల్ల సాగర్‌కు తరలించేందుకు ఏపీ ప్రభుత్వం ఈ కొత్త ప్రాజెక్టును ప్రతిపాదించిందని చెబుతోంది. ఈ ప్రాజెక్టును నిలిపివేయాలని ఇదివరకే కేంద్ర జలశక్తి శాఖకు, జల వనరుల సంఘానికి లేఖ రాసింది. పోలవరం నల్లమల్ల సాగర్ కోసం ఏపీ ప్రభుత్వం టెండర్ నోటిఫికేషన్ జారీ చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసింది తెలంగాణ. తమ ప్రయోజనాలకు నష్టం కలిగించే నిబంధనలు, విభజన చట్టానికి వ్యతిరేకంగా బనకచర్ల లింకు ప్రాజెక్టు చేపట్టకుండా చూడాలని కోరింది.

# కరూర్ తొక్కిసలాట ఘటన- సీబీఐ విచారణకు హాజరైన నటుడు విజయ్



**కరూర్ :** తొక్కిసలాట కేసులో టీవీకే అధినేత విజయ్ సీబీఐ విచారణకు హాజరయ్యారు. సోమవారం ఉదయం చెన్నై నుంచి దిల్లీకి ప్రత్యేక విమానంలో వచ్చిన ఆయన, నేరుగా సీబీఐ కేంద్ర కార్యాలయానికి వెళ్లారు. ఈ కేసులో ఇప్పటికే టీవీకే చెందిన ఆఫీస్ బేరర్లను విచారించిన కేంద్ర దర్యాప్తు సంస్థ తాజాగా విజయ్‌ను విచారణకు హాజరుకావాలని ఆదేశించింది.టీవీకే అధినేతను ప్రశ్నించిన అనంతరం సీబీఐ, న్యాయస్థానంలో ఛార్జిషీటు దాఖలు చేయనుందని తెలిసింది. కరూర్ తొక్కిసలాట ఘటనపై దర్యాప్తు చేపట్టేందుకు తమిళనాడు ప్రభుత్వం సిట్‌ను ఏర్పాటు చేసింది. అయితే సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు సీబీఐ దర్యాప్తు చేపట్టింది. గతేడాది టీవీకే అధినేత విజయ్ తమిళనాడులో కరూర్‌లో నిర్వహించిన ర్యాలీలో తొక్కిసలాట జరిగి 41 మంది మృతిచెందగా, 60 మందికిపైగా గాయపడ్డారు.

# సబర్మతి తీరాన పతంగి సందడి గాలిపటాలు ఎగురవేసిన మోదీ, జర్మన్ ఛాన్సలర్

గుజరాత్ సంస్కృతికి చిహ్నంగా నిలిచే అంతర్జాతీయ గాలిపటాల పండుగ అహ్మదాబాద్‌లోని సబర్మతి నదీ తీరంలో అట్టహాసంగా ప్రారంభమైంది. రంగురంగుల గాలిపటాలతో ఆకాశం ఒక అద్భుతమైన కాన్వాస్‌లా మారిపోయింది. ఈ వేడుకలకు భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు జర్మన్ ఛాన్సలర్ ఫ్రెడరిక్ మెర్జ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. ఈ ఇద్దరు ప్రపంచ నేతలు చిన్నపిల్లల్లా ఉత్సాహంగా గాలిపటాలు ఎగురవేస్తూ సందడి చేయడం అక్కడికి వచ్చిన వారిని విశేషంగా ఆకట్టుకుంది.గాంధీజీకి నివాళులు.. ద్వైపాక్షిక చర్చలువేడుకల ప్రారంభానికి ముందు ప్రధాని మోదీ, ఛాన్సలర్ మెర్జ్ కలిసి చారిత్రక సబర్మతి ఆశ్రమాన్ని సందర్శించారు. భారత స్వాతంత్ర్య పోరాటానికి కేంద్ర బిందువైన ఆశ్రమంలో మహాత్మా గాంధీకి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం రివర్‌ఫ్రంట్‌కు చేరుకున్న నేతలు, గాలిపటాల తయారీలో నిమగ్నమైన మహిళా కళాకారులతో ముచ్చటించారు. గాలిపటాల తయారీ వెనుక ఉన్న నైపుణ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో భాగంగా ఇరు దేశాల మధ్య వ్యూహాత్మక సంబంధాలపై గాంధీనగర్‌లో




కీలక సమావేశాలు కూడా జరగనున్నాయి.రికార్డు స్థాయిలో పర్యాటకులుఈ ఏడాది గాలిపటాల పండుగ సరికొత్త రికార్డులను సృష్టించబోతోంది. ప్రపంచవ్యాప్తంగా 50 దేశాల నుండి 135 మంది నిపుణులైన క్రీడాకారులు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించడానికి వచ్చారు. అలాగే దేశం నలుమూలల నుండి వెయ్యి మందికి పైగా పతంగి ప్రేమికులు ఈ ఉత్సవంలో పాల్గొంటున్నారు. గతేడాది దాదాపు 3.8 లక్షల మంది సందర్శకులు రాగా, ఈసారి ఆ సంఖ్య 5 లక్షలు దాటుతుందని ప్రభుత్వం అంచనా వేస్తోంది. ముఖ్యంగా 'ఆపరేషన్ సిందూర్ల గుర్తుగా ఎగురవేసిన ప్రత్యేక గాలిపటం ఈ వేడుకల్లో హైలైట్‌గా నిలిచింది.పర్యాటక రంగానికి కొత్త ఊపుఈ ఉత్సవాల ద్వారా గుజరాత్ పర్యాటక రంగం ప్రపంచస్థాయి గుర్తింపును పొందుతోంది. కేవలం అహ్మదాబాద్‌లోనే కాకుండా రాజ్ కోట్, సూరత్, స్టాట్యూ ఆఫ్ యూనిటీ వంటి పర్యాటక ప్రాంతాల్లో కూడా ఈ ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. దీనివల్ల రాష్ట్రంలోని చారిత్రక కట్టడాలు, సంస్కృతి ప్రపంచానికి పరిచయం అవుతున్నాయి. అంతర్జాతీయ నాయకుల రాకతో ఈ పండుగ ఖ్యాతి మరింత పెరిగింది. జనవరి 14వ తేదీ వరకు ఈ గాలిపటాల సందడి నిరంతరాయంగా కొనసాగనుంది.

# అల్లర్లతో అట్టుడుకుతున్న ఇరాన్ 500 మందికిపైగా మృతి



**ఇరాన్ :** అట్టుడుకుతున్నది. ఆ దేశ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ నేతృత్వంలోని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు కొనసాగుతున్నాయి. అదే సమయంలో నిరసనలపై ఆ దేశం ఉక్కుపాదం మోపుతోంది. సైన్యం కాల్పుల్లో వందలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారు.తాజా సమాచారం ప్రకారం.. ఈ ఆందోళనల్లో మృతుల సంఖ్య 500 దాటింది. దాదాపు 530 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అమెరికాకు చెందిన మానవ హక్కుల సంఘం తెలిపింది. దాదాపు 490 మంది నిరసనకారులు కాగా, 48 మంది భద్రతా సిబ్బంది మరణించినట్లు సమాచారం. రెండు వారాల్లో దాదాపు 10,600 మందికి పైగా అరెస్ట్ అయినట్లు పేర్కొంది. ఇరాన్ దవాఖానలు శవాల కుప్పలతో నిండిపోయినట్లు అంతర్జాతీయ మీడియా పేర్కొంటోంది. టెహ్రాన్ సహా దేశవ్యాప్తంగా దవాఖానల్లో శవాలు ఒకదానిపై మరొకటి పడి ఉన్నాయని, రోగులతో వార్డులు కిటకిటలాడు తున్నాయని మెడికల్ వర్కర్స్ తెలిపారు.మరోవైపు ఇరాన్‌లో తాజా పరిస్థితులపై అమెరికా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ మేరకు ఖమేనీ ప్రభుత్వానికి తీవ్ర హెచ్చరికలు జారీ చేసింది. ఇరాన్‌పై సైనిక చర్య అవకాశాల్ని అమెరికా తీవ్రంగా పరిగణిస్తోంది. ఆందోళనకారులకు ఏమైనా జరిగితే తాము రంగంలోకి దిగుతామని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పదే పదే హెచ్చరిస్తున్నారు. దీంతో ఇరాన్ సైతం అమెరికాకు కీలక హెచ్చరికలు చేసింది. సైనిక చైర్య బెదిరింపులు చేస్తే అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకుంటామని టెహ్రాన్ బెదిరింపులకు పాల్పడింది.

# ప్రశాంత్ కిషోర్ పార్టీకి భోజ్‌పురి గాయకుడు రితేష్ పాండే రాజీనామా

**పాట్నా:** ప్రశాంత్ కిషోర్ జన్ సురాజ్ పార్టీకి భోజ్‌పురి గాయకుడు రితేష్ పాండే రాజీనామా చేశారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఘోర ఓటమిని చవిచూసిన నెలరోజుల తర్వాత ఈ పరిణామం చోటుచేసుకుంది. తన రాజీనామా నిర్ణయాన్ని సోషల్ మీడియాలో పాండే వెల్లడించారు. క్రియాశీలక రాజకీయాల నుంచి తప్పుకోవాలనుకోవడానికి కారణాన్ని కూడా ఆయన తెలియజేశారు.బాధ్యత కలిగిన భారతీయుడుగా తాను 'జన్ సురాజ్జ పార్టీలో చేరానని, పూర్తి నిజాయితీతో ప్రజాస్వామ్య ప్రక్రియలో పాల్గొన్నానని, పార్టీకి ప్రతికూల ఫలితాలు వచ్చినప్పటికీ చింతించడం లేదని పాండే తెలిపారు. సాధారణ రైతు కుటుంబం నుంచి వచ్చిన తనపై ప్రజలు ఎంతో ప్రేమ, ఆదరణ, గౌరవం కనబరిచారని, ఈ స్థాయికి తీసుకువచ్చారని అన్నారు. ఎప్పటిలాగే తాను ప్రజాసేవ కొనసాగిస్తానని చెప్పారు. క్రియాశీలక రాజకీయాల్లో ఉంటూ ఆ పని చేయడం చాలా



కష్టమని, ఆ కారణంగా తాను జన్ సురాజ్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి ఈరోజు రాజీనామా చేస్తున్నానని ఆ ట్వీట్‌లో తెలిపారు. తన ఆలోచనలను క్లుప్తంగా తెలియజేసేందుకు ప్రయత్నించా నని, ప్రజలు అర్థం చేసుకుంటారనే నమ్మకం తనకుందని అన్నారు. 2025 జూలైలో పార్టీలో చేరికబిహార్ అసెంబ్లీ ఎన్నికలకు ముందు 2025 జూలైలో ప్రశాంత్ కిషోర్ సమక్షంలో జన్‌సురాజ్ పార్టీలో రితేష్ పాండే చేరారు. పార్టీ టిక్కెట్టుపై రోహ్‌టాస్ జిల్లా కర్గహార్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. అయితే జేడీయూ అభ్యర్థి విశిష్ట సింగ్ చేతిలో 35,6876 ఓట్ల తేడాతో ఓడిపోయారు.

# బెంగళూరు-విజయవాడ హైవే నాలుగు గిన్నీస్ రికార్డులు



**బెంగళూరు :** బెంగళూరు-విజయవాడ రహదారి నిర్మాణంలో రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్ కాంట్రాక్ట్ సంస్థ 4 గిన్నిస్ రికార్డులు నెలకొల్పింది. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సోమవారం వర్చువల్‌గా ఆ సంస్థ యాజమాన్యానికి ధ్రువీకరణ పత్రాలను అందించారు. అద్భుతమైన రికార్డు నెలకొల్పినందుకు రాజ్‌పథ్ ఇన్‌ఫ్రాకాన్‌ను ఇరువురూ అభినందించారుఈ నెల ఆరో తేదీన సత్యసాయి పుట్టపర్తి జిల్లా బొంతలపల్లి సమీపంలో 28.89 కిలో మీటర్ల పొడవైన రహదారిని కేవలం 24 గంటల్లో పూర్తి చేసి తొలి రికార్డు సాధించింది. అలాగే 24 గంటల్లో అత్యధికంగా 10,655 టన్నుల బిటుమినస్ కాంక్రీట్‌ను విరామం లేకుండా వేసి రెండో రికార్డు సాధించింది. ఇక, ఈ నెల 11వ తేదీ వరకు 57,500 టన్నుల బిటుమినస్ కాంక్రీట్‌ను నిర్విరామంగా వేసి మూడో రికార్డు దక్కించుకుంది. అలాగే మొత్తం 156 లేన్ కిలోమీటర్ల పొడవైన రహదారి (26 కి.మీ. మేర 6 వరుసలు)ని నిర్విరామంగా వేసి నాలుగో రికార్డు సాధించింది.ఇంత ప్రత్యేకమైన ఘనత సాధించినందుకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ, ఏపీ సీఎం చంద్రబాబు అభినందనలు తెలియజేశారు . మన ఇంజినీర్లు, అధికారులు అసాధ్యాన్ని సుసాధ్యం చేశారు, ఈ ఘనత సాధించడంలో కృషి చేసిన ప్రతిఒక్కరికీ అభినందనలని గడ్కరీ పేర్కొన్నారు. అలాగే నూతన సాంకేతికతతో తక్కువ సమయంలో రహదారుల నిర్మాణం వేగంగా పూర్తిచేశారని, నాణ్యత విషయంలో రాజీ లేకుండా రోడ్ల నిర్మాణం జరుగుతోందని కొనియాడారు.

# బడ్జెట్‌లో గణాంకాల గారడీ వద్దు వాస్తవ పరిస్థితులు ప్రతిబింబించాలి

2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్?ను పార్లమెంట్?లో ప్రవేశపెట్టడానికి కేంద్రం సిద్ధమవుతున్న వేళ కాంగ్రెస్ సీనియర్ నేత జైరాం రమేష్ కీలక వ్యాఖ్యలు చేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, గణాంకాల గారడీలతో సరిపెట్టుకుంటుండా, వాస్తవ పరిస్థితులను ప్రతిబింబించేలా బడ్జెట్?ను ప్రతిపాదించాలని ఆయన పేర్కొన్నారు. కేవలం జీడీపీ అంకెలు గొప్పగా చూపిస్తే సరిపోదన్నారు. క్షేత్రస్థాయిలో ఉపాధి కల్పన, సామాన్యుడి పొదుపు దారుణంగా పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్ సమావేశాల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో జైరాం రమేశ్ 'ఎక్స్ల వేదికగా స్పందించారు.ప్రభుత్వం ఇప్పటి వరకు కేవలం గణాంకాలతో ఆర్థిక వ్యవస్థ అంతా బాగుందనే భ్రమను కల్పిస్తోందని, ఈ బడ్జెట్‌తోనైనా ఆ అలాంటి ఆలోచనల నుంచి బయటకు రావాలని ఆయన సూచించారు. 2026-27 బడ్జెట్‌ను మరో ఇరవై రోజుల్లో పార్లమెంట్?లో ప్రవేశపెట్టనుందని, ఇదే సమయంలో 16వ ఆర్థిక సంఘం సిఫార్సులను ఈ బడ్జెట్ కచ్చితంగా ప్రతిబింబిస్తుందని రమేష్ పేర్కొన్నారు. వచ్చే ఐదేళ్ల( 2026-27 నుంచి 2031-32) కాలానికి సంబంధించిన ఈ



సిఫార్సులు కేంద్ర-రాష్ట్రాల మధ్య పన్ను ఆదాయాల పంపిణీ, రాష్ట్రాల మధ్య ఆ నిధుల కేటాయింపుకు నిర్దేశిస్తాయన్నారు. ఇప్పటికే ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ బలవంతంగా తీసుకొచ్చిన 60:40 వ్యయ విధానంతో రాష్ట్రాలు ఆందోళన చెందుతున్నాయన్నారు. ఇప్పుడు రాబోయే 16వ ఆర్థిక సంఘం కేటాయింపులు ఎలా ఉండబోతున్నాయని ఉత్కంఠగా ఎదురుచూస్తున్నాయని చెప్పుకొచ్చారు."16వ ఆర్థిక సంఘం తన నివేదికను 2025 నవంబర్ 17న సమర్పించింది. 2026-27 నుంచి 2031-32 వరకు పన్నుల వాటా ఎలా ఉండాలనేది అందులో ఉంటుంది. అయితే రాష్ట్రాలు ఇప్పటికే ఉపాధి హామీ పథకం నిధుల్లో కేంద్రం ఏకపక్షంగా తెచ్చిన 60:40 నిష్పత్తి నిబంధన రాష్ట్రాల మెడపై కత్తిలా మారింది. ఇప్పుడు పన్నుల వాటాలో ఇంకేం కోతలు పెడతారోనని రాష్ట్రాలు ఆందోళనలో ఉన్నాయి"- జైరాం రమేష్‌మూడు ప్రధాన సవాళ్లు ఇవేభారత ఆర్థిక వ్యవస్థను ప్రధానంగా మూడు సమస్యలు పట్టి పీడిస్తున్నాయని జైరాం రమేశ్ విశ్లేషించారు. "కార్పొరేట్ కంపెనీలకు పన్ను మినహాయింపులు ఇచ్చారు. అవి భారీగా లాభాలు గడిస్తున్నాయి. అయినా సరే, అవి తిరిగి కొత్త పరిశ్రమల్లో పెట్టుబడులు పెట్టడం లేదు. పెట్టుబడులు రాకపోతే కొత్త ఉద్యోగాలు ఎలా వస్తాయి? దేశంలో గృహ పొదుపు రేట్లు గణనీయంగా పడిపోయాయి. మధ్యతరగతి ప్రజల చేతిలో డబ్బు నిలవడం లేదు. ఇది దేశ పెట్టుబడి సామర్థ్యాన్ని దెబ్బతీస్తోంది. దేశంలో సంపద, ఆదాయం, వినియోగంలో అసమానతలు అంతకంతకూ లోతుగా మారుతున్నాయి. ధనికులు మరింత ధనికులుగా, పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. ఈ అగాధాన్ని పూడ్చకపోతే ప్రమాదం తప్పదు" అని అన్నారు.

# ఇంటర్నేషనల్ స్కూల్‌లో బంగ్లాదేశ్ జెండా బజరంగ్ దళ్ హెచ్చరిక

ఒక ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన జెండాల్లో బంగ్లాదేశ్ జెండా కూడా ఉన్నది. ఆ దేశంలో హిందువులపై జరుగుతున్న హత్యలపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన బంగ్లాదేశ్ జెండాపై బజరంగ్ దళ్ తీవ్రంగా హెచ్చరించింది. మహారాష్ట్రలోని పాల్గఢ్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. నలసోపారాలోని ర్యాన్ ఇంటర్నేషనల్ స్కూల్ గోడపై పలు దేశాల జెండాలున్నాయి. ఇందులో బంగ్లాదేశ్ జెండా కూడా ఉన్నది.కాగా, భారత్, బంగ్లాదేశ్ మధ్య సంబంధాలు క్షీణించాయి. ఆ దేశంలోని మైనారిటీలైన హిందువుల హత్యలపై భారత్‌లో తీవ్ర నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలో నలసోపారాలోని ర్యాన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో బంగ్లాదేశ్ జెండా కనిపించడంపై బజరంగ్ దళ్ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఆ జెండాను తొలగించేందుకు పోలీసులతో కలిసి బజరంగ్ దళ్ సభ్యులు ఆ ఇంటర్నేషనల్ స్కూల్‌కు వెళ్లారు.



TGTEL/25/A3750
... నిజమే ...
నిజాయితీ
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక
మంగళవారం
జనవరి 13, 2026


# గ్రౌండ్లో కింగ్ స్నేక్ డ్యాన్స్..గ్లెన్ ఫిలిప్స్ అవుటయ్యాక విరాట్ వినూత్న సెలబ్రేషన్



వడోదరలో జరిగిన భారత్-న్యూజిలాండ్ తొలి వన్డేలో టీమ్ ఇండియా 4 వికెట్ల తేడాతో విజయం సాధించి సిరీస్‌లో 1-0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ విజయం కంటే కూడా విరాట్ కోహ్లీ చేసిన ఒక ఫన్నీ సెలబ్రేషన్ ఇప్పుడు సోషల్ మీడియాను ఊపేస్తోంది. మైదానంలో ఎప్పుడూ ఎనర్జిటిక్‌గా ఉండే కోహ్లీ, కివీస్ బ్యాటర్ గ్లెన్ ఫిలిప్స్ అవుటైన సమయంలో స్నేక్ చార్మర్ అవతారం ఎత్తి చేసిన డాన్స్ అభిమానులను కడుపుబ్బ నవ్విస్తోంది.న్యూజిలాండ్ ఇన్నింగ్స్ 34వ ఓవర్‌లో కుల్దీప్ యాదవ్ వేసిన బంతిని గ్లెన్ ఫిలిప్స్ షాట్ ఆడబోయి పాయింట్‌లో ఉన్న శ్రేయస్ అయ్యర్‌కు క్యాచ్ ఇచ్చాడు. అయ్యర్ అద్భుతమైన డైవ్‌తో ఆ క్యాచ్‌ను పట్టుకున్నాడు. వెంటనే కోహ్లీ అయ్యర్ దగ్గరకు వెళ్లి, ఒక స్నేక్ చార్మర్ నాగస్వరం ఊదుతున్నట్లుగా సైగలు చేస్తూ.. అయ్యర్‌ను పాములా డాన్స్ చేయమని సరదాగా ఆటపట్టించాడు. గతంలో కూడా కోహ్లీ ఇలాంటి ఫన్నీ స్టెప్పులతో అలరించినప్పటికీ, ఈ స్నేక్ చార్మర్ యాక్ట్ మాత్రం నెక్స్ట్ లెవల్‌లో ఉందంటున్నారు నెటిజన్లు.ఈ మ్యాచ్‌లో కోహ్లీ బ్యాటింగ్‌కు దిగకముందే ఒక అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. టీమిండియా తరఫున అత్యధిక వన్డేలు ఆడిన ఆటగాళ్ల జాబితాలో మాజీ కెప్టెన్ సౌరవ్ గంగూలీని కోహ్లీ అధిగమించాడు. గంగూలీ భారత్ తరఫున 308 వన్డేలు ఆడగా, ఈ మ్యాచ్ కోహ్లీకి 309వ వన్డే. తద్వారా భారత్ తరఫున అత్యధిక వన్డేలు ఆడిన ఐదో ప్లేయర్‌గా కోహ్లీ నిలిచాడు. ఈ జాబితాలో సచిన్ టెండూల్కర్ (463) అగ్రస్థానంలో ఉన్నారు.బ్యాట్‌తోనూ కోహ్లీ పరుగుల వరద పారించాడు. ఈ మ్యాచ్‌లో 93 పరుగులు చేసిన విరాట్, అంతర్జాతీయ క్రికెట్‌లో 28,000 పరుగుల మైలురాయిని అత్యంత వేగంగా చేరుకున్న బ్యాటర్‌గా చరిత్ర సృష్టించాడు. ఈ ఘనత సాధించిన ప్రపంచంలో మూడో ప్లేయర్‌గా (సచిన్, సంగక్కర తర్వాత), రెండో భారతీయుడిగా కోహ్లీ రికార్డు నెలకొల్పాడు. 624 ఇన్నింగ్స్‌ల్లోనే ఈ ఫీట్ సాధించిన కోహ్లీ, సచిన్ టెండూల్కర్ (644 ఇన్నింగ్స్‌లు) రికార్డును కూడా బద్దలు కొట్టడం విశేషం.

# బంగ్లాదేశ్‌పై ఇండియా సర్జికల్ స్ట్రైక్ క్రికెటర్ల ఆదాయానికి గండికొడుతున్న స్పాన్సర్లు




భారత్, బంగ్లాదేశ్ దేశాల మధ్య రాజకీయ ఉద్రిక్తతలు క్రీడా మైదానంలోనూ సెగలు పుట్టిస్తున్నాయి. క్రికెట్ పరంగా బంగ్లాదేశ్ ఇప్పుడు ఒక గడ్డు కాలాన్ని ఎదుర్కొంటోంది. టీమిండియా దిగ్గజ బ్రాండ్లు బంగ్లాదేశ్ ఆటగాళ్లకు ఇస్తున్న మద్దతును ఉపసంహరించుకోవడమే కాకుండా, ఆ దేశంతో వ్యాపార సంబంధాలను కూడా తెంచుకుంటున్నాయి. దీనివల్ల బంగ్లాదేశ్ క్రికెటర్ల వ్యక్తిగత ఆదాయంతో పాటు ఆ దేశ స్పోర్ట్స్ ఇండస్ట్రీ కూడా తీవ్రమైన ఆర్థిక సంక్షోభంలో పడిపోయింది.ప్రముఖ భారతీయ క్రీడా సామాగ్రి తయారీ సంస్థ ా ఇప్పటికే బంగ్లాదేశ్ టాప్ ఆటగాళ్లతో తన ఒప్పందాలను నిలిపివేసింది. బంగ్లాదేశ్ ప్రస్తుత కెప్టెన్ లిట్టన్ దాస్, మోమినుల్ హక్ వంటి స్టార్ ప్లేయర్లకు ఈ సంస్థ బ్యాట్ స్పాన్సర్‌గా ఉండేది. అయితే, ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా కాంట్రాక్ట్ రెన్యూవల్స్?ను ా+ పక్కన పెట్టేసింది. మరోవైపు, ప్రముఖ బ్రాండ్ సరీన్ స్పోర్ట్స్(ాూ) కూడా నలుగురైదుగురు బంగ్లాదేశ్ క్రికెటర్ల స్పాన్సర్‌షిప్ కాంట్రాక్టులను రద్దు చేసినట్లు సమాచారం.కేవలం స్పాన్సర్‌షిప్ మాత్రమే కాకుండా, వ్యాపారపరంగా కూడా బంగ్లాదేశ్‌కు పెద్ద దెబ్బ తగిలింది. ఇప్పటివరకు ాూ వంటి భారతీయ సంస్థలు తమ స్పోర్ట్స్ అపారెల్, ఇతర సామాగ్రిని బంగ్లాదేశ్‌లోని ఫ్యాక్టరీలలో తయారు చేయించేవి. అయితే, ప్రస్తుత అస్థిర పరిస్థితుల వల్ల భారతీయ సంస్థలు బంగ్లాదేశ్ నుండి తమ సప్లై లైన్లను పూర్తిగా నిలిపివేశాయి. గత ఆరు నెలలుగా ా+ కూడా తన ఉత్పత్తుల పంపిణీని ఆ దేశంలో ఆపేసింది. దీనివల్ల బంగ్లాదేశ్‌లోని స్థానిక ఫ్యాక్టరీలకు అందే ఆదాయం నిలిచిపోయింది.ఈ గొడవ అంతా ఐపీఎల్ వేలంతో మొదలైంది. కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను భారీ ధరకు కొనుగోలు చేసినప్పటికీ, బీసీసీఐ ఆదేశాల మేరకు అతడిని జట్టు నుండి తప్పించింది. దీనికి ప్రతిచర్యగా బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు, తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిషేధించింది. అంతేకాకుండా, 2026 టీ20 వరల్డ్ కప్ మ్యాచ్‌లను భారత్ నుంచి శ్రీలంకకు మార్చాలని ఐసీసీని కోరింది. ఈ పరిణామాలన్నీ భారత్-బంగ్లాదేశ్ క్రికెట్ బంధాన్ని మరింత క్షీణింపజేశాయి.

# రోకోకు సన్మానం కోహ్లీ మరో రెండు ఘనతలు




ఛేదనలో రోహిత్ శర్మ (26) మెరుపులు మెరిపించినా ఎక్కువసేపు క్రీజులో నిలువలేకపోయాడు. దక్షిణాఫ్రికాతో వన్డే సిరీస్‌కు దూరంగా ఉండి రీఎంట్రీ ఇచ్చిన కెప్టెన్ గిల్ కూడా ప్రారంభంలో ఆచితూచి ఆడినా ఛేదనలో మొనగాడు కోహ్లీ మాత్రం తన భీకర ఫామ్‌ను కొనసాగిస్తూ అభిమానులను అలరించాడు. ఎదుర్కొన్న మూడో బంతినే మిడాన్ దిశగా బౌండరీతో పరుగుల వేటను ఆరంభించిన అతడు.. క్రీజులో ఉన్నంతసేపూ అదే జోష్‌ను కొనసాగించాడు. క్రిస్టియన్ క్లార్క్ ఓవర్లో రెండు, ఆదిత్య ఓవర్లో రెండు బౌండరీలు బాదిన కోహ్లీ.. 44 బంతుల్లోనే తన కెరీర్‌లో 77వ ఫిఫ్టీని నమోదుచేశాడు.ఆరంభంలో నెమ్మదిగా ఆడిన గిల్.. ఆతర్వాత వేగం పుంజుకున్నాడు. 66 బంతుల్లో అతడి హాఫ్ సెంచరీ పూర్తైంది. అయితే ఆ తర్వాత అతడు భారత సంతతి స్పిన్నర్ ఆదిత్య బౌలింగ్‌లో ఫిలిప్స్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరడంతో 118 పరుగుల రెండో వికెట్‌కు తెరపడింది. గిల్ స్థానంలో వచ్చిన అయ్యర్ కూడా జోరు కొనసాగించడంతో భారత్ లక్ష్యం వైపు వేగంగా సాగింది. అయితే కోహ్లీ శతకానికి 7 పరుగుల దూరంలో ఉండగా జెమీసన్ వరుస ఓవర్లలో భారత్‌కు షాకులిచ్చాడు. కోహ్లీతో పాటు జడేజా, అయ్యర్‌ను ఔట్ చేయడంతో అభిమానుల్లో కలవరం మొదలైంది. కానీ హర్షిత్, వాషింగ్టన్ (7ి) అండగా కేఎల్ రాహుల్ (29ి) లాంఛనాన్ని పూర్తిచేశాడు.ఆరంభం అదిరినా..అంతకుముందు టాస్ ఓడి మొదలు బ్యాటింగ్ చేసిన కివీస్‌కు మెరుగైన ఆరంభమే దక్కింది. ఆ జట్టు ఓపెనర్లు కాన్వే, నికోల్స్ తొలి వికెట్‌కు శతాధిక భాగస్వామ్యం (117) నెలకొల్పి శుభారంభం అందించినా మిడిలార్డర్ దానిని సద్వినియోగం చేసుకోలేకపోయింది. నిలకడగా ఆడిన ఈ ఇద్దరూ వాషింగ్టన్ వేసిన 20వ ఓవర్లో బౌండరీలతో అర్ధ శతకాలు సాధించారు. కానీ రాణా వరుస ఓవర్లలో నికోల్స్, కాన్వేను ఔట్ చేసి ఆ జట్టును దెబ్బకొట్టాడు.సిరాజ్ కూడా యంగ్ (12)ను వెనక్కిపంపగా ప్రమాదకర ఫిలిప్స్ (12)ను కుల్దీప్ స్పిన్ మాయకు బలయ్యాడు. ఒకపక్క క్రమం తప్పకుండా వికెట్లు పడుతునా నిలకడగా ఆడిన మిచెల్.. 51 బంతుల్లో హాఫ్ సెంచరీ సాధించాడు. చివరి ఓవర్లలో అతడు ధాటిగా ఆడటంతో కివీస్.. భారత్ ఎదుట పోరాడగలిగే స్కోరును నిలపగలిగింది.రోకోకు సన్మానంమ్యాచ్ ప్రారంభానికి ముందు దిగ్గజ క్రికెటర్లు రోహిత్, కోహ్లీ ద్వయాన్ని బరోడా క్రికెట్ అసోసియేషన్, బీసీసీఐ ఘనంగా సత్కరించింది. ఈ కార్యక్రమానికి ఐసీసీ చైర్మన్ జై షా, బీసీసీఐ అధ్యక్షుడు మిథున్ మన్హాస్ తదితరులు హాజరయ్యారు.కోహ్లీ మరో రెండు ఘనతలుఅంతర్జాతీయ క్రికెట్‌లో రన్‌మిషీన్ కోహ్లీ మరో రెండు రికార్డులను తన పేరిట లిఖించుకున్నాడు. వడోదర వన్డేలో 26 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద ఉండగా ఇంటర్నేషనల్ క్రికెట్‌లో అత్యంత వేగంగా 28 వేల పరుగుల మార్కును అందుకున్న క్రికెటర్‌గా అతడు రికార్డులకెక్కాడు. 624 ఇన్నింగ్స్‌ల్లో కోహ్లీ ఈ ఘనత సాధించాడు. సచిన్ (644 ఇన్నింగ్స్), సంగక్కర (666) రికార్డులను కోహ్లీ అధిగమించాడు. అంతేగాక ఈ మ్యాచ్‌లో కోహ్లీ.. అత్యధిక పరుగులు చేసిన ఆటగాళ్ల జాబితాలో సచిన్ (34,357) తర్వాత రెండో స్థానానికి (28,068) ఎగబాకి సంగక్కర (28,016)ను మూడో స్థానానికి నెట్టాడు.

# దేశం ఈఎంఐ ట్రాప్‌లో చిక్కుతుందా ఉద్యోగం చేసేది జీతం కోసం కాదా




జీతం ఇలా వచ్చి.. అలా ఖర్చు అయిపోతుంది. సాలరీ క్రెడిట్ మెసేజ్ రాగానే, ఈఎంఐ కటింగ్ మెసేజ్ కూడా దాని వెంటనే వచ్చేస్తోంది. ఒకటో తేదీన జీతం వస్తే 5వ తేదీ నాటికి అంతా ఖాళీ. అమ్మో ఒకటో తారీఖు అనేలా తయారైంది చాలా మంది పరిస్థితి. క్రెడిట్ కార్డ్ బిల్లులు, ఫోన్లలో లోన్ యాప్ రిమైండర్‌లు ఇలా ఒకటే టెన్షన్. ఇది నిర్లక్ష్యంగా ఖర్చు చేసే కథ కాదు. అత్యవసర పరిస్థితులను నిర్వహించడానికి సహాయపడే సులభమైన రుణం ఎంత సులభంగా లభిస్తుందో, అది నిశ్శబ్దంగా ఇంటి ఆర్థిక వ్యవస్థపై నిరంతర ఒత్తిడిగా మారిందని ఇది చెబుతుంది.అప్పు తీసుకోవడం అనేది అప్పుడప్పుడు మద్దతుగా ఉండటం నుండి నెలవారీ అవసరంగా మారడంతో నిశ్శబ్ద రుణ సంక్షోభం క్రమంగా పెరుగుతోంది. భారతదేశం అంతటా ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న 10,000 మంది రుణగ్రహీతలపై జూన్, డిసెంబర్ 2025 మధ్య రుణ పరిష్కార సంస్థ నిపుణుల ప్యానెల్ నిర్వహించిన దేశవ్యాప్త సర్వే ఈ సంక్షోభం స్థాయిని స్పష్టంగా తెలియజేస్తుంది. భారతీయ కుటుంబాలలో ఎక్కువ భాగం రోజువారీ జీవితంలో రుణ ఒత్తిడి ఒక నిర్వచించే లక్షణంగా మారిందని ఈ పరిశోధనలు చూపిస్తున్నాయి.ఈ సర్వే ప్రకారం 85 శాతం మంది రుణగ్రహీతలు తమ నెలవారీ ఆదాయంలో 40 శాతం కంటే ఎక్కువ జువీ× ల కోసం ఖర్చు చేస్తున్నారు . చాలా ఇళ్లలో, ఆహారం, అద్దె, రవాణా, పాఠశాల ఫీజులు లేదా వైద్య ఖర్చులు లెక్కించబడటానికి ముందే దాదాపు సగం జీతం చెల్లించాల్సి ఉంటుంది. ముఖ్యంగా తక్కువ, మధ్యతరగతి ఆదాయం ఉన్నవారిలో ఈ ఒత్తిడి తీవ్రంగా ఉంటుంది. నెలవారీ ఆదాయం రూ.35,000 నుండి రూ.65,000 మధ్య ఉన్న రుణగ్రహీతలు రూ.28,000 నుండి రూ.52,000 వరకు జువీ× బాధ్యతలు ఎదుర్కొంటున్నారని నివేదించారు. అందుకే అనవసరమైన వాటిని ఈఎంఐలో వస్తుంది కదా అని కొనుగోలు చేకుండా ఉండటం ఉత్తమం

# ఈ బడ్జెట్‌లో అవి నెరవేరుతాయా గంపెడు ఆశలు పెట్టుకున్న సీనియర్ సిటిజన్లు





: 2025 కేంద్ర బడ్జెట్ సమయంలో ఆదాయపు పన్ను నుండి ుణూ కు గణనీయమైన మినహాయింపులు అందించింది. ఇప్పుడు బడ్జెట్ 2026 సాధారణ పౌరుల నుండి సీనియర్ సిటిజన్ల వరకు అందరికీ గణనీయమైన ఉపశమనం కలిగించే కొన్ని మినహాయింపులను కూడా అందిస్తుందని భావిస్తున్నారు. అద్దె, స్థిర డిపాజిట్లు నుండి వచ్చే ఆదాయంపై ుణూ పరిధిని మరింత విస్తరింపజేయాలని భావిస్తున్నారు. ఇంకా పాత పన్ను విధానంలో మార్పుల కోసం చర్చలు జరుగుతున్నాయి.సీనియర్ సిటిజన్లకు వడ్డీ ఆదాయంపై ుణూ తగ్గింపు పరిమితిని పెంచడమే ఈ అధిక ుణూ పరిమితి లక్ష్యం. 2025-26 ఆర్థిక సంవత్సరం నుండి బ్యాంకులు వార్షిక ఆదాయం రూ.1 లక్ష దాటితేనే స్థిర డిపాజిట్ వడ్డీపై ుణూను తగ్గిస్తాయి. ఇది మునుపటి రూ.50,000 పరిమితి. వడ్డీ ఆదాయంపై ఎక్కువగా ఆధారపడే పదవీ విరమణ చేసిన వ్యక్తులకు ఈ పరిమితిని మరింత పెంచాలనే డిమాండ్లు ఉన్నాయి.అద్దె ఆదాయానికి మరింత ఉపశమనం అంచనా:అద్దె ఆదాయానికి కూడా ఉపశమనం కల్పించింది. కానీ ఇప్పుడు మరింత పెంచాలని డిమాండ్లు వస్తున్నాయి. అద్దె ఆదాయం కోసం వార్షిక ుణూ పరిమితిని రూ.2.40 లక్షల నుండి రూ.6 లక్షలకు పెంచారు. ఇది అద్దె ఆదాయం పొందుతున్న వారికి గణనీయమైన ఉపశమనం కలిగిస్తుంది. అయితే, ఇప్పుడు మరింత పెంచాలని డిమాండ్లు వస్తున్నాయి.పాత పన్ను విధానం మారవచ్చు:కేంద్ర బడ్జెట్ 2026 సమీపిస్తున్నందున సీనియర్ సిటిజన్లు మరోసారి మరిన్ని పన్ను మినహాయింపులు, కీలక పొదుపు పథకాలపై వడ్డీ రేట్లలో సవరణ కోసం ఆశిస్తున్నారు. పాత పన్ను విధానం ప్రకారం సీనియర్ సిటిజన్లకు గరిష్ట మినహాయింపు పరిమితి ప్రస్తుతం సంవత్సరానికి రూ.3 లక్షలు, అయితే 80 సంవత్సరాలు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న చాలా సీనియర్ సిటిజన్లు రూ.5 లక్షల అధిక పరిమితి నుండి ప్రయోజనం పొందుతారు. కొత్త పన్ను విధానంలో ప్రాథమిక మినహాయింపు పరిమితిని రూ.4 లక్షలకు పెంచారు. అయితే రాబోయే బడ్జెట్‌లో పాత పన్ను వ్యవస్థలో మార్పులు చేయవచ్చని భావిస్తున్నారు.సీనియర్ సిటిజన్లు కూడా ఈ మినహాయింపు పొందవచ్చు:2024 కేంద్ర బడ్జెట్‌లో ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ 75 ఏళ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న సీనియర్ సిటిజన్లకు పన్ను సమ్మతిని సరళీకృతం చేశారు. సవరించిన నిబంధనల ప్రకారం, పెన్షన్, వడ్డీ నుండి మాత్రమే ఆదాయం పొందే వ్యక్తులు కొన్ని షరతులను నెరవేర్చినట్లయితే ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయకుండా మినహాయింపు పొందుతారు. విస్తృత శ్రేణి పదవీ విరమణ చేసిన వారికి ప్రయోజనం చేకూర్చేందుకు ఈ వయోపరిమితిని 70 సంవత్సరాలకు తగ్గించాలని ఆర్థిక ప్రణాళికదారులు గతంలో కేంద్ర బడ్జెట్ 2025లో సిఫార్సు చేశారు. బడ్జెట్ 2026 సమీపిస్తున్న కొద్దీ, ఈ ప్రతిపాదనకు మద్దతు పెరుగుతోంది.సీనియర్ సిటిజన్స్ సేవింగ్స్ స్కీమ్‌లు , పోస్టాఫీస్ సేవింగ్స్ ఖాతాలపై వచ్చే వడ్డీపై ప్రభుత్వం పన్ను మినహాయింపును పెంచవచ్చనే ఊహాగానాలు కూడా పెరుగుతున్నాయి. తమ రోజువారీ ఖర్చుల కోసం ఈ పథకాలపై ఎక్కువగా ఆధారపడే పదవీ విరమణ పొందిన వారికి ఈ అదనపు పన్ను ఉపశమనం నుండి గణనీయమైన ఆర్థిక సహాయం లభిస్తుంది. ఇది వారి పదవీ విరమణ తర్వాత సంవత్సరాల్లో వారి ఆదాయ భద్రతను బలోపేతం చేస్తుంది.

# కొనసాగుతున్న నష్టాలు




సుంకాల విషయంలో అమెరికా అధ్యక్షుడి బెదిరింపులు, అంతర్జాతీయ ంగా ప్రతికూల సంకేతాలు దేశీయ సూచీలపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మరింత పతనం కావడం కూడా స్టాక్‌మార్కెట్ల నష్టానికి ఒక కారణంగా మారింది. మరోవైపు ఐటీ, మెటల్ రంగ స్టాక్స్‌లో అమ్మకాలు కొనసాగుతున్నాయి. దీంతో సెన్సెక్స్, నిఫ్టీ నష్టాల్లో కదలాడుతున్నాయి. గత సెషన్ ముగింపు (83, 576)తో పోల్చుకుంటే సోమవారం ఉదయం 150 పాయింట్లకు పైగా నష్టంతో మొదలైన సెన్సెక్స్ ఆ తర్వాత మరింత కిందకు దిగజారింది. ఒక దశలో 500 పాయింట్లకు పైగా కోల్పోయింది. ప్రస్తుతం ఉదయం 10:15 గంటల సమయంలో సెన్సెక్స్ 437 పాయింట్ల నష్టంతో 83, 138 వద్ద కొనసాగుతోంది. మరో వైపు నిఫ్టీ కూడా సెన్సెక్స్ బాటలోనే కదలాడుతోంది. ప్రస్తుతం 126 పాయింట్ల నష్టంతో 25, 556 వద్ద కొనసాగుతోంది సెన్సెక్స్‌లో మణప్పురం ఫైనాన్స్, ఇండియన్ రెన్యుబుల్, బీఎస్ఈ లిమిటెడ్, హిందుస్థాన్ జింక్, కోల్ ఇండియా మొదలైన షేర్లు లాభాల్లో ఉన్నాయి (ంష్టుతీవ ఝతీనెవ్ అవషం). హిటాచీ ఎనర్జీ, భెల్, దివీస్ ల్యాబ్స్, ట్యూబ్ ఇన్వెస్ట్‌మెంట్స్, లారస్ ల్యాబ్స్ మొదలైన షేర్లు నష్టాల బాటలో సాగుతున్నాయి. నిఫ్టీ మిడ్ క్యాప్ ఇండెక్స్ 352 పాయింట్ల నష్టంతో ఉంది. బ్యాంక్ నిఫ్టీ 183 పాయింట్ల నష్టంతో ఉంది. డాలర్‌తో పోల్చుకుంటే రూపాయి మారకం విలువ 90.24గా ఉంది.

మంగళవారం,
జనవరి 13, 2026
TGTEL/25/A3750 ... నిజమే ...
నిజాయితీ
https://nijamenijayathi.com తెలుగు దిన పత్రిక



# సొంత మనుషులే ఇలా చేస్తున్నారు



సినీపరిశ్రమను ఎక్కువగా వేధిస్తున్న సమస్య ఫేక్ రివ్యూస్. కథ, డైరెక్షన్, యాక్టింగ్ ఇలా ప్రతి అంశం సరిగ్గా ఉన్నప్పటికీ కొందరు ఫేక్ రివ్యూస్ ఇవ్వడంతో సినిమా విజయంపై తీవ్ర ప్రభావం చూపిస్తుంది. సోషల్ మీడియాలో ఫేక్ రివ్యూస్ షేర్ చేస్తూ.. సినిమా విడుదలైన క్షణాల్లోనే రిజల్ట్ క్లియర్ చేస్తున్నారు. అలాగే బుక్ మై షో వంటి వెబ్ సైట్స్ లోనూ సినిమాలకు నెగిటివ్ రేటింగ్స్ ఇస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంపై మన శంకరవరప్రసాద్ గారు సినిమా నిర్మాతలు కోర్టును ఆశ్రయించగా.. కోర్టు ఆదేశాల ప్రకారం బుక్ పై షోలో నెగిటివ్ రేటింగ్స్, రివ్యూస్ ఆప్షన్ తాత్కలికంగా నిలిపివేశారు. దీనిపై స్టా?ర్ హీరో విజయ్ దేవరకొండ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. ఈ విషయం తనకు సంతోషాన్ని కలిగించినప్పటికీ.. కొంత బాధను కూడా ఇస్తుందని తెలిపారు. ఇదే విషయాన్ని సుదీర్ఘంగా రాసుకొచ్చారు.“బుక్ మై షోలో ఇలా చూడడం ఒక రకంగా సంతోషంగా.. మరో రకంగా బాధగానూ ఉంది. ఈ చర్యతో చాలా మంది కష్టం, కలలు, డబ్బును కాపాడుకునేందుకు దారి కనబడింది. ఇక బాధపడాల్సిన విషయం ఏంటంటే.. మన సొంతవాళ్లే ఇలాంటి సమస్యలు సృష్టిస్తున్నారు. బతకండి.. బతకనీయండి, అనే నినాదం ఏమైందీ.. ? అందరూ కలిసి ఎదగాలనే భావన ఎక్కడికి వెళ్లింది ? డియర్ కామ్రేడ్ మూవీ సమయంలో వ్యవస్థీకృతమైన రాజకీయాలతో ఇలాంటి దాడులు చూసి షాకయ్యాను. నేను మాట్లాడిన ప్రతిసారి చెవిటి వాడి ముందు శంఖం ఊదినట్లు అయ్యింది. ఒక మంచి సినిమాను ఎవరూ ఆపలేరని నాతో అన్నారు. నాతో పనిచేసిన దర్శకులు, నిర్మాతలకు ఈ సమస్య గురించి అర్థమయ్యింది.ఎందుకు ఇలా చేస్తున్నారని ఎన్నో నిద్రలేని రాత్రులు గడిపా.. నా కలలను కాపాడుకునేందుకు వీళ్లతో ఎలా పోరాటం చేయాలా ? అనుకున్నా. ఇన్నాళ్లకు ఈ విషయం బయటకు వచ్చినందుకు సంతోషిస్తున్నాను. చిరంజీవి లాంటి అగ్ర హీరో సినిమాకు కూడా ఇలాంటి ముప్పు ఉందని కోర్టు గుర్తించినందుకు సంతోషంగా ఉంది. దీనితోనే ఈ సమస్య పూర్తి కాదు.. కానీ కొంతవరకు మేలు జరుగుతుంది. మన శంకరవరప్రసాద్ సినిమాతోపాటు సంక్రాంతికి వస్తున్న అన్ని సినిమాలు విజయం సాధించాలని కోరుకుంటున్నాను” అంటూ రాసుకొచ్చారు. ప్రస్తుతం విజయ్ దేవరకొండ చేసిన పోస్ట్ నెట్టింట వైరల్ గా మారింది.




## నా జీవితాన్ని మార్చేసిన రోజు నా ఆనందాన్ని మాటల్లో చెప్పలేను

అల్లు అర్జున్.. ఈ పేరుకు ఇప్పుడున్న ఫాలోయింగ్ గురించి చెప్పక్కర్లేదు. గంగోత్రి సినిమాతో హీరోగా వెండితెరకు పరిచయమయ్యాడు. మొదటి సినిమాతోనే సక్సెస్ అందుకున్నాడు. కానీ ఆ సమయంలో ఎన్నో విమర్శలు ఎదుర్కొన్నాడు. యాక్టింగ్ , లుక్స్ ను ఎగతాళి చేశారు. కట్ చేస్తే.. ఆర్య సినిమాతో విమర్శకులకు చెక్ పెట్టాడు. ఈ మూవీతో ఊహించని క్రేజ్ సొంతం చేసుకున్నాడు. ఈ మూవీ తర్వాత బన్నీ వెనుదిరిగి చూడలేదు. ఆ తర్వాత వరుస సినిమాలతో అలరిస్తున్న బన్నీ కెరీర్ మార్చిన మరో సినిమా పుష్ప 1. ఈ మూవీతో పాన్ ఇండియా స్టార్ హీరోగా ఇమేజ్ సంపాదించుకున్నాడు. అల్లు అర్జున్ కెరీర్ లో పుష్ప 1, 2 సినిమాలకు ఉండే క్రేజ్ గురించి తెలిసిందే. అయితే బన్నీ జీవితాన్ని మార్చిన ఆర్య, పుష్ప 1 సినిమాలకు దర్శకత్వం వహించింది డైరెక్టర్ సుకుమార్. వీరిద్దరి కాంబోలో వచ్చిన చిత్రాలు బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టించాయి. ఇవి కూడా చదవండి :తనకు పాన్ ఇండియా స్టార్ హీరోగా గుర్తింపు తెచ్చిపెట్టిన డైరెక్టర్ సుకుమార్ అంటే బన్నీకి ఎనలేని గౌరవం. ఈ విషయాన్ని ఇదివరకు పలు సందర్భాల్లో బయటపెట్టాడు. ఇప్పుడు జనవరి 11న సుకుమార్ పుట్టిన రోజు సందర్భంగా మరోసారి సుకుమార్ పై తన ప్రేమను వెల్లడించాడు. ఆయనకు బర్త్ డే విషెస్ తెలుపుతూ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టాడు. “హ్యాపీ బర్త్ డే సుక్కు డార్లింగ్.. ఈరోజు నీకంటే నాకే ఎక్కువ ప్రత్యేకం ఈరోజు. ఎందుకంటే ఈరోజు నా జీవితాన్ని మార్చింది. నా జీవితంలో నువ్వు ఉండడం వల్ల నాకు కలిగిన ఆనందాన్ని మాటల్లో చెప్పలేను” అంటూ సుకుమార్ పై తన ప్రేమను వ్యక్తం చేశారు. చివర్లో పుట్టినందుకు థ్యంక్స్.. అంటూనే కాపీరైట్స్ అంటూ హీరో నవదీప్ ను ట్యా?గ్ చేశాడు. ప్రస్తుతం బన్నీ చేసిన పోస్ట్ నెట్టింట వైరలవుతుండగా.. నెటిజన్స్, సినీ ప్రముఖులు ఆయనకు బర్త్ డే విషెస్ తెలుపుతున్నారు.డైరెక్టర్ సుకుమార్, అల్లు అర్జున్ కాంబోలో వచ్చిన పుష్ప 1, పుష్ప 2 చిత్రాలు బాక్సాఫీస్ రికార్డ్స్ బ్రేక్ చేశాయి. ముఖ్యంగా బన్నీ జీవితంలో సుకుమార్ పాత్ర ప్రత్యేకం. హీరోగా ఆయన జీవితానికి బ్రేక్ ఇచ్చింది ఆర్య సినిమా. ఈ మూవీతో బన్నీ స్టైలిష్ స్టార్ గా యూత్ ఐకాన్ గా మారాడు. ఆ తర్వాత వచ్చిన సినిమాలన్నీ హిట్స్ కాగా.. పుష్ప సినిమాతో పాన్ ఇండియా స్టార్ గా మారారు బన్నీ.

# మన శంకరవరప్రసాద్ గారు మూవీ రివ్యూ



మన శంకరవరప్రసాద్ గారునటీనటులు: చిరంజీవి, నయనతార, వెంకటేష్, కేథరిన్ త్రెసా, సచిన్ ఖేడ్ కర్, బుల్లి రాజు, అభినవ్ గోమటం, హర్షవర్ధన్ తదితరులుఎడిటింగ్: తమ్మి రాజుసంగీతం: భీమ్స్‌సినిమా టోగ్రఫీ: సమీర్ రెడ్డికథ స్ర్కీన్ ప్లే దర్శకత్వం: అనిల్ రావిపూడినిర్మాతలు: సాహు గారపాటి, సుస్మిత కొణిదెలకథ:శంకరవరప్రసాద్ (చిరంజీవి) ఇంటెలిజెన్స్ ఆఫీసర్. కేంద్ర మంత్రి దగ్గర సెక్యూరిటీగా ఉంటాడు. అతని భార్య శశిరేఖ (నయనతార) ఇండియాలోనే రిచెస్ట్ బిజినెస్ ఉమెన్. ఇద్దరు ప్రేమించి పెళ్లి చేసుకుంటారు. కాని చిన్నచిన్న ఈగోలతో విడిపోతారు. తన పిల్లల్ని కూడా చూడలేకపోతున్నాను అని శంకరవరప్రసాద్ బాగా ఫీల్ అవుతుంటాడు. అలాంటి సమయంలో తన టీం నారాయణ (హర్షవర్ధన్), జ్వాల (కేథరిన్ త్రెసా) మరో ఇద్దరితో కలిసి పిల్లలకు దగ్గర ఇవ్వడానికి ఒక ప్లాన్ వేస్తారు. అదే సమయంలో శశిరేఖ తండ్రి మీద అటాక్ జరుగుతుంది. అది ఎవరు చేశారో తెలుసుకోవడానికి సెంట్రల్ గవర్నమెంట్ శంకర వరప్రసాద్ ను శశిరేఖ ఇంటికి సెక్యూరిటీ ఆఫీసర్ గా పంపిస్తారు. ఆ తర్వాత ఏం జరిగింది.. ఎలా విడిపోయిన భార్యాభర్తలు కలిశారు అనేది మిగిలిన కథ..కథనం:కథ కావాలి.. కథనం ఉండాలి అనుకుంటే మన శంకరవరప్రసాద్ గారు చాలా రొటీన్ గానే అనిపిస్తారు. కానీ అనిల్ రావిపూడి సినిమాలలో కథ కంటే ఎక్కువగా కథనం వేగంగా ఉంటుంది. మనోడు స్టోరీ మీద కంటే ఎంటర్టైన్మెంట్ మీద ఎక్కువ దృష్టి పెడతాడు. అందుకే సక్సెస్ రేట్ కూడా ఎక్కువగా ఉంది. నో లాజిక్.. ఓన్లీ వింటేజ్ మెగా మ్యాజిక్ కోసం అయితే మన శంకరవరప్రసాద్ గారు మనసుకి నచ్చేస్తారు. ఇప్పుడు అసలు విషయంలోకి వచ్చేద్దాం.. ఈ జనరేషన్ దర్శకులలో చిరంజీవిని ఆయన అర్థం చేసుకున్నట్టు ఎవరు అర్థం చేసుకోలేదు. పాతికేళ్లు దాటిపోయింది మెగాస్టార్ ను అలా స్ర్కీన్ మీద చూసి. అన్నయ్య సినిమాలో ఇలాంటి కామెడీ టైమింగ్ చూసాము. ఆ తర్వాత ఎన్నో బ్లాక్బస్టర్స్ చిరంజీవి ఇచ్చాడు కానీ.. ఆ కామెడీ మాత్రం రాలేదు.. ఇన్నాళ్లకు ఆ లోటు అనిల్ తీర్చేశాడు. ఫస్టాఫ్ లోనే పైసా వసూల్ అయిపోయింది.. మెగా వింటేజ్ చమక్కులు.. ఆ పంచ్ డైలాగులు.. సెల్ఫ్ సెటైర్లు.. చిరంజీవికి మాత్రమే సాధ్యమైన కొన్ని మోడ్యులేషన్స్.. ఏ ఒక్కటి వదలకుండా స్ర్కీన్ మీద దించేశాడు.ఇక చిరంజీవి కూడా ఎంత ఆకలి మీద ఉన్నాడో అనేది ఈ సినిమా చూస్తే అర్థమవుతుంది.. తనకు కామిక్ క్యారెక్టర్ దొరికితే ఎలా రెచ్చిపోతాడో మరోసారి ప్రూవ్ చేశాడు మెగాస్టార్. జస్ట్ టైం గ్యాప్ అంతే టైమింగ్ లో అస్సలు గ్యాప్ ఉండదని స్ర్కీన్ మీద రఫ్ ఆడించాడు. ఒక్కొక్క సీనులో చిరంజీవి కామెడీ టైమింగ్ చూస్తుంటే ఘరానా మొగుడు గుర్తొచ్చింది. ఫస్టాఫ్ అయితే హిలేరియస్.. సెకండ్ హాఫ్ అక్కడక్కడ కాస్త తగినట్టు అనిపిస్తుంది కానీ చివర్లో సెట్ అయిపోయింది. వెంకటేష్ వచ్చాక స్ర్కీన్ దద్దరిల్లిపోయింది. చిన్న చిన్న సీన్స్ కూడా అనిల్ రావిపూడి రాసిన దానికంటే 100 రెట్లు ఇంప్రోవైజ్ చేశాడు చిరు. సింపుల్ గా చెప్పాలంటే శంకరవరప్రసాద్ గా తన ఆకలి మొత్తం తీర్చేసుకున్నాడు బాస్. లుక్స్ పరంగా కూడా చిరంజీవి నెక్స్ట్ లెవెల్ లో ఉన్నాడు.. హుక్ స్టెప్, మెగా విక్టరీ సాంగ్స్ విజువల్ గా అదిరిపోయాయి. చాలా సన్నివేశాలు చిరంజీవి పాత సినిమాలు నుంచి తీసుకొని రీ క్రియేట్ చేశాడు అనిల్. మరీ ముఖ్యంగా 90స్ లో వచ్చిన ఘరానా మొగుడు రిఫరెన్స్ ఎక్కువగా ఉంది. చిరంజీవి కూడా 30 ఏళ్ల తర్వాత అదే మ్యాజిక్ మళ్ళీ రిపీట్ చేశాడు. ఈ తరం దర్శకులలో ఆడవాళ్ళ సైకాలజీ అనిల్ రావిపూడి కంటే ఎవరికీ బాగా తెలియదు.. సెకండ్ హాఫ్ లో వాళ్లు సైకాలజీ మీద వచ్చే ఒక సీన్ భలే ఉంది.నటీనటులు:చిరంజీవి నటన గురించి కొత్తగా ఏం చెప్పాలి.. కానీ ఆయనకు ఎంటర్టైన్మెంట్ క్యారెక్టర్ వస్తే ఎలా స్ర్కీన్ మీద నవ్వులు పూయిస్తాడు అనేది మన శంకరవరప్రసాద్ గారు మరోసారి నిరూపించింది. చిరును ఎలా వాడుకోవచ్చో ఈ సినిమా మళ్లీ చూపించింది. వెంకటేష్ ఉన్నది 20 నిమిషాలైనా కూడా అదరగొట్టాడు. నయనతార కూడా చాలా అందంగా ఉంది. కేథరిన్ త్రెసా, సచిన్ ఖేడ్ కర్, బుల్లి రాజు, అభినవ్ గోమటం, హర్షవర్ధన్ ఎవరికి వాళ్లు తమ పాత్రలకు న్యాయం చేశారు.టెక్నికల్ టీం:భీమ్స్ మ్యూజిక్ బాగుంది. పాటలు వినడానికి మాత్రమే కాదు స్ర్కీన్ మీద కూడా చూడడానికి చాలా బాగున్నాయి. సమీర్ రెడ్డి సినిమాటోగ్రఫీ నెక్స్ట్ లెవెల్ లో ఉంది. తమ్మి రాజు ఎడిటింగ్ కూడా బాగుంది. దర్శకుడు అనిల్ రావిపూడి మరొకసారి తన రైటింగ్ పవర్ చూపించాడు. పాత కథ తీసుకున్న కూడా దాన్ని ఎంటర్టైన్మెంట్ పద్ధతిలో చెప్పే ప్రయత్నం చేశాడు. నిర్మాణ విలువలు బాగున్నాయి.పంచ్ లైన్:ఓవరాల్ గా మన శంకరవరప్రసాద్ గారు.. బాగున్నారు.. పండక్కి నవ్విస్తారు..!

# సంక్రాంతికి సినిమాల జాతర థియేటర్లు ఫుల్లు



రెండు తెలుగు రాష్ట్రాల్లో పండగ సందడి మొదలైంది. అలాగే అటు టాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద కూడా సంక్రాంతి సినిమాల జాతర షురు అయ్యింది. ఇప్పటికే ఈ ఫెస్టివల్ వైబ్ తీసుకువస్తూ జనవరి 9న థియేటర్లలో విడుదలైంది రాజాసాబ్. ప్రభాస్, డైరెక్టర్ మారుతి కాంబోలో వచ్చిన ఈ సినిమాకు మంచి రెస్పాన్స్ వస్తుంది. అలాగే ఇప్పుడు మరిన్ని సినిమాలు సైతం ప్రేక్షకులను అలరించేందుకు రెడీ అయ్యాయి. అలాగే థియేటర్లతోపాటు ఓటీటీలోనూ పలు చిత్రాలు సందడి చేయనున్నాయి. డైరెక్టర్ అనిల్ రావిపూడి దర్శకత్వం మెగాస్టార్ చిరంజీవి నటించిన లేటేస్ట్ మూవీ మన శంకరవరప్రసాద్ గారు. పక్కా ఫ్యామిలీ ఎంటర్టైనర్ గా వస్తున్న ఈ చిత్రంలో లేడీ సూపర్ స్టార్ నయనతార హీరోయిన్ గా నటిస్తుంది. ఈ చిత్రాన్ని జనవరి 12న రిలీజ్ చేయనున్నారు.అలాగే ఎప్పటిలాగే మాస్ మహరాజా రవితేజ సైతం ఈ పండక్కి థియేటర్లలో ప్రేక్షకులను అలరించనున్నారు. డైరెక్టర్ కిశోర్ తిరుమల దర్శకత్వంలో రవితేజ నటిస్తున్న సినిమా భర్త మహాశయులకు విజ్ఞప్తి. ఇందులో ఆషికా రంగనాథ్, డింపుల్ హయాతి హీరోయిన్లుగా నటించగా.. జనవరి 13న ఈ సినిమాను అడియన్స్ ముందుకు తీసుకురానున్నారు.ఇవే కాకుండా జాతిరత్నాలు సినిమాతో స్టార్ డమ్ సొంతం చేసుకున్న నవీన్ పొలిశెట్టి సైతం ఈసారి పండక్కి అలరించనున్నారు. గౌరవపురం జమీందార్ గోపరాజు మనవడు రాజు పాత్రలో సంక్రాంతికి నవ్వులు పంచేందుకు సిద్ధమయ్యారు. ఆయన హీరోగా వస్తున్న సినిమా అనగనగా ఒక రాజు. సంక్రాంతి కానుకగా జనవరి 14న ఈ సినిమాను రిలీజ్ చేయనున్నారు. ఇందులో మీనాక్షి చౌదరి కథనాయికగా నటించింది.అలాగే శర్వానంద్ హీరోగా నటించిన మూవీ నారీ నారీ నడుమ మురారి. ఈ సినిమాకు రామ్ అబ్బరాజు దర్శకత్వం వహించారు. సంక్రాంతి కానుకగా జనవరి 14న విడుదల కానుంది. మాజీ ప్రేయసి, ప్రస్తుత లవర్ మధ్య నలిగిపోయే యువకుడి కథలో శర్వానంద్ కనిపించనున్నారు. ఇందులో సంయుక్త, సాక్షి వైద్య నటిస్తున్నారు.

# ఉదయ్ కిరణ్ ఆ సినిమా చేయను అన్నాడు



టాలీవుడ్ ఇండస్ట్రీలో వెర్సటైల్ చిత్రాలకు కేరాఫ్ అడ్రస్ రవిబాబు. ఎన్నో చిత్రాలతో నటుడిగా, దర్శకుడిగా, నిర్మాతగా తనదైన ముద్ర వేశారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన.. తన వ్యక్తిగత జీవితంలోని కీలక అంశాలను వెల్లడించారు. అలాగే తన కెరీర్ లో సోగ్గాడు సినిమా గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. ఈ సినిమాను రూ. 2.75 కోట్ల బడ్జెట్‌తో నిర్మించగా.. తొలి వారంలో రూ. 1.50 కోట్లు, రెండో వారంలో రూ. 70-75 లక్షలు వసూలు చేసిందని, శాటిలైట్ హక్కుల ద్వారా కూడా లాభాలు తెచ్చిపెట్టిందని అన్నారు. సోగ్గాడు చిత్రం వాస్తవానికి ఆ కాలంలో అగ్రతారలైన తరుణ్, ఉదయ్ కిరణ్, ఆర్తి అగర్వాల్‌లతో చేయాలని ప్లాన్ చేసుకున్నానని అన్నారు. సినిమా చేయడానికి తరుణ్, ఆర్తి అగర్వాల్‌లు సినిమా చేయడానికి అంగీకరించగా, ఉదయ్ కిరణ్ మాత్రం ఒప్పుకుంటానని, చేయనని పలుమార్లు తన నిర్ణయాన్ని మార్చుకున్నారని చెప్పారు. ఉదయ్ కిరణ్ మద్రాస్‌లో సినిమా చేస్తానని చెప్పడంతో, రవిబాబు సురేష్ బాబుకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. అయితే, సురేష్ బాబును కలిసిన ఉదయ్ కిరణ్ అనూహ్యంగా సినిమా చేయనని చెప్పడంతో రవిబాబు, సురేష్ బాబు ఇద్దరూ ఆశ్చర్యపోయారు.దీంతో కోపంతో “నువ్వు చేయకపోతే ఏంటి, ఇంకెవరినో పెట్టి నేను చేస్తాను” అని తాను తీసుకున్న నిర్ణయమే సినిమా ఫ్లాప్ కావడానికి కారణమని అన్నారు. ఉదయ్ కిరణ్ జుగల్ హన్స్‌రాజ్‌ను తీసుకువచ్చినట్లు తెలిపారు. సోగ్గాడు అసలు క్లైమాక్స్ చాలా భిన్నంగా ఉండేదని రవిబాబు చెప్పారు. కిరణ్ అని, తరుణ్ కేవలం సహాయం మాత్రమే చేశాడని చెబుతుంది. తరుణ్ కూడా ఉదయ్ కిరణ్ వద్దకే వెళ్లమని సలహా ఇస్తాడు. అయితే ఉదయ్ మధ్యలో కూర్చుని ఏడుస్తూ ఉంటుందని, చివరకు ఆమె ముందు గులాబీ పువ్వు పడుతుందని, అది ఎవరు వేసిందీ చెప్పకుండా సినిమా ముగుస్తుందని అసలు క్లైమాక్స్ వివరించారు. అయితే, ప్రిడిక్టబిలిటీ కారణంగా ఈ క్లైమాక్స్ మార్చాల్సి వచ్చిందని, అది తామంతా కలిసి చేసిన తప్పేనని రవిబాబు అంగీకరించారు. కష్టమైనా, నష్టమైనా ఉదయ్ కిరణ్‌నే ఒప్పించి ఉండాలని లేదా అసలు సినిమానే తీసి ఉండకూడదని అభిప్రాయపడ్డారు.ఉదయ్ కిరణ్, తరుణ్ ఒకే స్థాయి నటులు కావడం వల్ల వారి మధ్య ఒక అమ్మాయి ఉన్న

# ఆఫర్స్ తగ్గిపోవడనికి కారణం అదే.



స్వయం వరం అనే సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగుపెట్టాడు నటుడు తొట్టెంపూడి వేణు. మొదటి సినిమతోనే మంచి హిట్ అందుకున్నాడు. ఆ తర్వాత వరుసగా సినిమాలు చేశాడు. అలాగే వరుస హిట్స్ కూడా అందుకున్నాడు వేణు. మనసుపడ్డాను కానీ, చిరునవ్వుతో, వీడెక్కడి మొగుడండి?, హనుమాన్ జంక్షన్, కళ్యాణ రాముడు, పెళ్ళాం ఊరెళితే, ఖుషీ ఖుషీగా, చెప్పవే చిరుగాలి, సదా మీ సేవలో, అల్లరే అల్లరి, బహుమతి, గోపి గోపిక గోదావరి ఇలా పలు హిట్ సినిమాల్లో నటించాడు వేణు. అలాగే వెంకటేష్ చింతకాలయ రవి, ఎన్టీఆర్ దమ్ము లాంటి సినిమాల్లో సహాయక నటుడిగానూ మెప్పించాడు. ఆతర్వాత సినిమాలకు గ్యాప్ ఇచ్చారు. 2013 తర్వాత ఇండస్ట్రీకి దూరమైపోయాడు వేణు. మళ్లీ 2022లో రామారావు ఆన్ డ్యూటీ సినిమాతో రీ ఎంట్రీ ఇచ్చాడు. అలాగే అతిథి అనే వెబ్ సిరీస్ లోనూ నటించి మెప్పించాడు.అతన్ని పిచ్చి పిచ్చిగా ప్రేమించా.. కానీ బ్రేకప్ అయ్యింది.. దివి ఎమోషనల్ కామెంట్స్గతంలో ఓ ఇంటర్వ్యూలో వేణు మాట్లాడుతూ.. హీరోగా దాదాపు 25-26 చిత్రాలలో నటించినట్లు వేణు గుర్తుచేసుకున్నారు. బస్టర్ విజయాన్ని అందుకుని, కెరీర్ ప్రారంభంలోనే మంచి జంక్షన్, పెళ్ళాం ఊరెళితే, చెప్పవే చిరుగాలి, గోపి గోపిక గోదావరి, సదా మీ సేవలో వంటి చిత్రాలతో కుటుంబ ప్రేక్షకులకు దగ్గరై, తన నటనతో వారిని ఆకట్టుకున్నానని పేర్కొన్నారు. తన విజయానికి కారణం ప్రేక్షకులేనని, మంచి కంటెంట్‌ను

Publisher, Owner And Editor Boddupally Mallaiah 3-62, Yendabetla, Nagarkurnool, Telangan - 509209, Printer, Gundur Shyam , Shyam Agencies Telkapally(M), Telangana 509385. Published 2-48/1 Near Hanuman Temple, Telkapally(M) Dist.Nagarkurnool, Telangana 509385.
Ph 9441946907, Email : nijamenijayithi@gmail.com Website : nijamenijayithi.com